తెలంగాణ పేపర్


తెలుగు దినపత్రిక

అభివృద్ధి కోసమే సీఎంకు మద్దతిచ్చా.. పోచారం మరోసారి హాట్ కామెంట్స్

కామారెడ్డి, ఆగస్టు 13: కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసాగింపుగా కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 265 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | శుక్రవారం, ఆగస్టు 14, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

కాంగ్రెస్ ఉన్నంతకాలం సెక్యులర్ వర్గాలకు మనుగడ: సీఎం రేవంత్



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్స్‌లెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

"రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ. 3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం.

బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. గత ప్రభుత్వం ఆర్ఎంపీ వైద్యుడిని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సభ్యుడిని చేసింది. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం"అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

నా ప్రసంగం తర్వాత శుద్ధి చేశారు: రాజ్యసభలో ఖర్గే వ్యాఖ్యలు



పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరిరోజున ఎగువ సభలో గందరగోళం నెలకొంది. ఉత్తరాఖండ్ ర్యాలీలో భాగంగా తన ప్రసంగం తర్వాత వేదిక వద్ద శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై వెంటనే కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. అదొక దురదృష్టకర ఘటన అని, అటువంటి కార్యక్రమాలను భాజపా ఏమాత్రం సమర్థించబోదని స్పష్టం చేశారు.

ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. రెండురోజుల తర్వాత ఒక గ్రూప్ అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో గురువారం రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే.. ఖర్గే ఈ విషయాన్ని లేవనెత్తారు. "నేను పాల్గొన్న ర్యాలీలో లక్షల మంది హాజరయ్యారు. నేను ఏ వర్గాన్ని గానీ, మతాన్ని గానీ ప్రస్తావించలేదు. ప్రజల సమస్యల గురించి మాత్రమే మాట్లాడాను. కానీ ప్రసంగం తర్వాత కొందరు అడిగారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిస్థితా..? ఇది భాజపా కార్యకర్తల పనే" అని తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఖర్గేకు మద్దతుగా కాంగ్రెస్ (జశీఅస్త్రతీవంం) ఎంపీలు నినాదాలు చేశారు. రాజ్యసభ ఛైర్మన్ కలుగజేసుకొని వారికి సర్దిచెప్పారు. ఈ ప్రపంచంలో అంటరానితనానికి మించిన పాపం లేదన్నారు. ఇందులో రెండో అభిప్రాయానికి తావులేదని, వారిని పట్టుకోవాలని ఛైర్మన్ సూచించారు.

అయితే, భాజపా కార్యకర్తల పనంటూ ఖర్గే చేసిన ఆరోపణలను జేపీ నడ్డా ఖండించారు. ఆ వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. "భాజపా చేసిందని పదేపదే చెప్పొద్దు. మా పార్టీ అలాంటి వాటిని ప్రోత్సహించదు. ఆ ఘటనపై దర్యాప్తు జరిపిస్తాం" అని హామీ ఇచ్చారు.

తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరిన మంత్రి పొంగులేటి

దిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్ 2.0 కింద తెలంగాణకు 11,56,915 ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారమిక్కడ ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్- 2024' యాప్ ద్వారా పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని.. ఇందులో 11.56 లక్షలకుపైగా కుటుంబాలు ఇళ్లకు అర్హమైనవిగా తేలిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఏడాది క్రితమే అనర్హుల తొలగింపు ప్రక్రియను పూర్తి చేసినప్పటికీ కేంద్రం ఇళ్ల మంజూరులో జాప్యం చేస్తోందని చెప్పారు. 12 ఏళ్లుగా రాష్ట్రంలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని, అందుకే పెద్ద మొత్తంలో మంజూరు చేయాలని విన్నవించారు. కేంద్ర పథకంతో సంబంధం లేకుండా కొత్త ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేస్తోందన్నారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తదితరులు ఉన్నారు.



రాష్ట్రానికి వచ్చి స్వయంగా పీఎంఏవై-జీ 2.0 ఇళ్ల కేటాయింపును ప్రకటించాలని కేంద్ర మంత్రికి విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి పొంగులేటి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలు: సీఈవో సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 13 : ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని తెలిపారు.బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్, అఎఅ, యఓ ఖఎఔలను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఇఅఎ, తెలంగాణ అఖా కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు వస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

యూనిటీ మాల్ ఒప్పందంపై విచారణ జరగాలి: ఎంపీ రఘునందన్ రావు..

ఢిల్లీ: తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు.కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు.యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో



అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన వర్షాకాల సమావేశాలు

సభలో తొలిసారి వందేమాతరం ఆరు చరణాల ఆలాపన..



న్యూఢిల్లీ, ఆగస్టు 13: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గురువారం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. ఈ రోజు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గీతంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గీతాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గీతాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతంతో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లు అయింది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో సుస్పష్టం చేసింది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్య వ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన బాట పట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ యాత్రకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు.అలాగే భారీగా పోలీసులను మోహరించారు. ఈ యాత్రను సీజేపీ చేపట్టింది. ఈ యాత్రలో భారీగా యువత పాల్గొంది. వారిపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. దీంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం చోటు చేసుకున్న వరుస పరిణామాల నేపథ్యంలో కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు.అదే విధంగా పార్లమెంట్‌లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీ ఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

తెలంగాణ పవర్

సంపాదకీయం

శుక్రవారం, ఆగస్టు 14, 2026

డ్రగ్స్ ముప్పు నుంచి బయటపడేదెలా..

తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య ఇంతింతై వటుడింతై అన్నట్టుగా విస్తరిస్తోంది. మొదట్లో హైదరాబాద్ కు మాత్రమే పరిమితం అనుకున్న డ్రగ్స్ ఇప్పుడు.. ఎడాపెడా ఎక్కడపడితే అక్కడ పట్టుబడుతున్నాయి. చివరకు డ్రగ్స్ పెడ్లర్లలో డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులు కూడా ఉండటం అందర్నీ అవాక్కయ్యేలా చేస్తోంది. అంతకుముందు పబ్బులు, క్లబ్బుల్లో మాత్రమే డ్రగ్స్ దందా జరుగుతోందనే భ్రమలో ఉన్న అధికారులకు.. ఇటీవలి కేసులు కళ్లు తెరిపిస్తున్నాయి. ఉదాహరణకు వీకెండ్‌లో డాక్టర్లంతా ఓ చోట కలుస్తుంటారు. అది పైకి సాధారణ గెట్‌టుగెదర్‌లాగే ఉంటుంది. కానీ పొరపాటున పోలీసులొస్తే.. వారంతా కంగారు పడతారు. పరారవటానికి ప్రయత్నిస్తారు. అలాంటి సందర్భాల్లో డాక్టర్ల దగ్గర డ్రగ్స్ దొరకటం చూసి పోలీసులు విస్తుపోతున్నారు. అదే సమయంలో స్కూలు బ్యాగ్‌లు, కాలేజీ క్యాంటీన్లలో డ్రగ్స్ పట్టుబడే కల్చర్ కూడా బాగా పెరిగిపోయింది. ఇప్పటికే చాలాసార్లు విద్యాసంస్థల యాజమాన్యాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చినా.. ప్రతి విద్యార్థిని 24 గంటలు తాము మాత్రం ఎలా గమనించగలమని అవి చేతులెత్తేశాయి. చివరకు క్యాంపస్‌లో డ్రగ్స్ దొరక్కుండా జాగ్రత్తపడుతున్నాయి. కానీ డ్రగ్స్ మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు ఏదో మార్గంలో డ్రగ్స్ తీసుకుంటూనే ఉన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం.. డ్రగ్స్ చాక్లెట్లు, డ్రగ్స్ సిగరెట్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అధికారులు డ్రగ్స్‌కు ఓ తలుపు మూసేస్తే.. మరో నాలుగు తలుపులు తెరుచుకుంటున్నాయి. అందుకే టాస్క్ ఫోర్స్, ఈగల్ పేరుతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినా.. అనుకున్న స్థాయిలో డ్రగ్స్‌ను కట్టడి చేయడం సాధ్యం కావడం లేదు.విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లు..చేయాల్సిన పని వదిలిపెట్టి స్టూడెంట్స్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. కేరళలోని వడకరలో రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన రవాణాలో కేసులో ముగ్గురు టీచర్లతో సహా ఓ డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.దర్యాప్తులో భాగంగా నిందితుల వాట్సాప్ మేసేజ్ లు, బ్యాంకు అకౌంట్ల ట్రాన్సాక్షన్లు పరిశీలించిన పోలీసులు..డ్రగ్స్ సరఫరా వెనుక కింగ్ పిన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన టీచర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడటం, డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం వారి వ్యక్తిగత జీవితాలనే కాదు.. యువత భవిష్యత్తును కూడా నాశనం చేస్తుంది డ్రగ్స్ కొనుగోలుకు కావాల్సిన డబ్బుకోసం వాటి విక్రయానికి సిద్ధపడుతున్నారు. దొంగతనాలు, దోపిడీలకూ తెగబడుతున్నారు. గంజాయి మత్తు తలకెక్కి రాత్రిళ్లు వీధుల్లో గొడవలకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. జీవితాలు అల్లకల్లోలమై ఆఖరికి ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. కాసుల యావతో జాతి భవితవ్యాన్ని చీకట్లోకి నెడుతున్న డ్రగ్స్ కింగ్ పిన్లకు త్వరగా శిక్షలు పడకపోతుండటం వల్లే డ్రగ్స్ వెల్లువకు అడ్డుకట్టవేయడం సాధ్యపడట్లేదు.ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2022-24 మధ్య దేశవ్యాప్తంగా మూడు లక్షల కేసులు నమోదయ్యాయి. 3.75 లక్షల మంది అరెస్టయ్యారు. కానీ, 268 మందికే శిక్షలు పడ్డాయి. తనిఖీలు, నమూనాల జప్తు, తరలింపుల్లో లోపాలు, ఫోరెన్సిక్ పరీక్షల్లో ఆలస్యం వంటివి దుర్మార్గులకు వరమవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్‌డీపీఎస్ కోర్టులు లేకపోవడం వల్లా కేసుల మేటలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సంబంధిత కేసులు నాలుగు లక్షల వరకు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ వీలైనంత త్వరగా కొలిక్కి రావాలంటే- అవసరానికి తగినట్లు అన్నిచోట్లా స్పెషల్ కోర్టులను ఏర్పాటుచేయాలి. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. మాదకమూకల పీచమణచడంలో అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉంటూ, వారి ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామాలపై విద్యార్థులకు అనునిత్యం అవగాహన కల్పిస్తూ, వారిని సరైన దారిలో నడిపించాలి. లేకపోతే భావి భారతం మనం ఊహించలేనంత ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు.ఈ కారణంగానే ఐఐటీ , ఐఐఎంలతో సహా దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్ కు చెక్ పెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఐఐటీ, ఐఐఎంలతో ప్రారంభించి అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలోనే స్వచ్ఛంద డ్రగ్స్ టెస్టులు నిర్వహించబోతున్నారు. ఈ మేరకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఆయా సంస్థల్లో అడ్మిషన్లు కోరే అభ్యర్థులు తమ అడ్మిషన్ పత్రాలతో పాటు యాంఫెటమైన్లు, కొకైన్, గంజాయి, బెంజోడయాజెపైన్లు, ఫెన్సైక్లిడిన్ వంటి మాదకద్రవ్యాల నిర్ధారణకు స్వచ్ఛందంగా యూరిన్ టెస్ట్ చేయించుకోవాలి. కేంద్ర విద్యా శాఖకు చెందిన ఉన్నత విద్యా విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం, దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా చెప్తున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాదకద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్ 2026-29లో దీన్ని జత చేశారు. దీని ప్రకారం వచ్చే మూడేళ్లలో కేంద్ర నిధులతో నడిచే 170 ఉన్నత విద్యా సంస్థలలోని సుమారు 10 లక్షల మంది విద్యార్థులకు దశలవారీగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు.2029 నాటికి 10 లక్షల మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై పరీక్షలు నిర్వహించే మిషన్ ను ప్రధాని మోడీ ఆగస్టు 2న ప్రారంభించారు. దీనికి నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌గా పేరు పెట్టారు. ఢిల్లీ ఎయిమ్స్ లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ ఈ మేరకు కాలేజీలు, వర్సిటీల విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల కోసం మార్గదర్శకాలు ఇచ్చింది. ఇందులో డ్రగ్స్ పరీక్ష పూర్తిగా స్వచ్ఛందంగా, గోప్యంగా ఉండాలని, పరీక్ష చేయించుకునే విద్యార్థులపై ఎటువంటి ప్రతికూల పరిణామాలకు దారితీయకూడదని, దీనిని కేవలం కౌన్సెలింగ్ ప్రయోజనాల కోసం మాత్రమే ఉంచాలని సూచించింది. ఈ డ్రగ్ పరీక్షల కార్యక్రమం మూడు దశల్లో అమలు చేస్తారు.

- ఎడిటర్

భారతదేశ ఫార్మా ఉత్పత్తిలో 40 శాతం, ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తిలో సుమారు మూడింట ఒక వంతు తెలంగాణ వాటానే..

- నవంబర్లో సీపీహెచ్ఐ ఆ పీఎంఈసీ ఇండియా 2026



హైదరాబాద్, ఆగస్టు 13, 2026: భారత ఫార్మా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రతిష్టాత్మక 'సీపీహెచ్ఐ ఆ పీఎంఈసీ ఇండియా 2026'ను రెండు వేర్వేరు వేదికలపై నవంబర్లో నిర్వహించనున్నారు. దేశంలోనే అత్యంత కీలకమైన లైఫ్ సైన్సెస్ హబ్‌లలో తెలంగాణ ఒకటి. ఈ నేపథ్యంలో సీనియర్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ నాయకులు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. భారతదేశం 2030 నాటికి 50 బిలియన్ డాలర్ల ఫార్మా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకోవడం, ఈ రంగం 2030 నాటికి సుమారు 130 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తుండటంతో దాని సామర్థ్యాన్ని, ప్రమాణాలను అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరంతో పాటు మునుపెన్నడూ లేని భారీ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి.

ఈ సందర్భంగా ఇన్ఫార్మా మార్కెట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ మాట్లాడుతూ భారత ఫార్మాస్యూటికల్ రంగానికి ఇది ఒక కీలకమైన దశాబ్దం కానుందన్నారు. సైన్స్, నైపుణ్యం, తయారీ రంగాల్లో భారతదేశానికి ఉన్న బలాలు పరిశోధన, అభివృద్ధి, కాంట్రాక్ట్ సేవలలో మరింత విలువైన అవకాశాలుగా మారుతున్నాయని చెప్పారు. భారత సీఆర్డీఎంఓ పరిశ్రమ 2028 నాటికి సుమారు 14 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, 2030 నాటికి 22 బిలియన్ డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారన్నారు. ఈ అవకాశాలను సాధించడం అనేది పరిశ్రమ నాణ్యత, సాంకేతికత, సామర్థ్యం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఎంత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తుందనే దానిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ సంవత్సరం నుంచి ప్రత్యేకమైన దృక్పథంతో వస్తున్న సీపీహెచ్ఐ ఆ పీఎంఈసీ ఇండియా ఈ అవకాశాలను సుదీర్ఘ కాల పరిమితి కలిగిన వృద్ధిగా, అంతర్జాతీయ ప్రాముఖ్యతగా మార్చడంలో సహాయపడే నిర్ణయాధికారులను, భాగస్వాములను ఒకే వేదిక పైకి తెస్తూ ఈ చర్చలకు ఒక ముఖ్యమైన వేదికను అందిస్తోందన్నారు.

ఈ సందర్భంగా ఇన్ఫార్మా మార్కెట్స్ ఇండియా సీనియర్ గ్రూప్ డైరెక్టర్ రాహుల్ దేశ్‌పాండే మాట్లాడుతూ భారత ఫార్మాస్యూటికల్ రంగంలో తెలంగాణలు ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. దేశ ఫార్మా ఉత్పత్తులలో తెలంగాణ వాటా దాదాపు 40 శాతం కాగా, ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తిలో ఇది సుమారు మూడో వంతు భాగస్వామ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. ఈ స్థాయి తయారీ సామర్థ్యం, సైంటిఫిక్ నైపుణ్యం, లైఫ్ సైన్సెస్ మౌలిక సదుపాయాల కలయిక ఈ రంగానికి ఈ ప్రాంతాన్ని అత్యంత కీలకమైనదిగా మారుస్తోందని పేర్కొన్నారు. కంపెనీలు సంక్లిష్టమైన తయారీ, బలమైన నిబంధనల పాటింపు, సాంకేతికతతో కూడిన ఉత్పత్తిపై పెట్టుబడులు పెడుతున్నందున, తయారీదారులు, సీడీఎంఓలు, ముడిసరుకు సరఫరాదారులు, సాంకేతిక ప్రదాతల మధ్య భాగస్వామ్యం మరింత కీలకం కానుందన్నారు. హైదరాబాద్ సమావేశం సీపీహెచ్ఐ ఆ పీఎంఈసీ ఇండియా 2026 సన్నాహకాల్లో ఈ ప్రాంతీయ ప్రాముఖ్యతను ప్రముఖంగా ముందుకు తెస్తుందన్నారు.

భారత ఫార్మా రరంగంలో వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ ప్రాముఖ్యత ఈ చర్చకు తగిన వేదికగా నిలుస్తోంది. ఫార్మాస్యూటికల్స్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్‌లు, బయోటెక్నాలజీ, పరిశోధన, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లతో కూడిన భారతదేశంలోనే లైఫ్-సైన్సెస్ ఈకోసిస్టమ్‌లలో ఒకటిగా తెలంగాణ అవతరించింది. తెలంగాణ ప్రభుత్వ 'నెక్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026--30' ప్రకారం.. రాష్ట్రంలో 2,000 పైగా లైఫ్-సైన్సెస్ కంపెనీలు, 250 పైగా యూఎస్ఎఫ్డీఏ ఆమోదిత తయారీ కేంద్రాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తిలో తెలంగాణ దాదాపు మూడో వంతు వాటాను కలిగి ఉంది. ఈ పాలసీ అమలు కాలంలో 25 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడం, ఐదు లక్షల ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. తయారీ, పరిశోధన, పెట్టుబడులు ఇక్కడ పెద్ద ఎత్తున కేంద్రీకృతమై ఉండటం వల్ల ఫార్మాస్యూటికల్ నాణ్యత, ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ, సీడీఎంఓ వృద్ధి, అధునాతన తయారీ సాంకేతికతలు, ఈ రంగం అత్యధిక విలువైన అవకాశాల వైపు పయనించడం వంటి అంశాలపై చర్చలకు హైదరాబాద్ ఒక సహజసిద్ధ వేదికగా మారింది.

పరిశ్రమల భాగస్వామ్యం, ప్రదర్శన విశేషాలు

19వ ఎడిషన్ సీపీహెచ్ఐ ఆ పీఎంఈసీ ఇండియా 2026 రెండు వేర్వేరు వేదికల్లో జరగనుంది. సీపీహెచ్ఐ ఇండియా 2026 నవంబర్ 23--25 తేదీల్లో ద్వారకాలోని ఐఐసీసీ, యశోభూమిలో, పీఎంఈసీ ఇండియా 2026 నవంబర్ 24--26 తేదీల్లో గ్రేటర్ నోయిడాలోని ఐఈఎంఎల్లో జరగనున్నాయి. సీపీహెచ్ఐ ఇండియా ప్రధానంగా ఫినిష్డ్ డోసేజ్ (తయారైన ఔషధాలు), ఎక్సిపియంట్లు, సహజ సారాలు (నాచురల్ ఎక్స్‌ట్రాక్ట్స్), ఫైన్ కెమికల్స్ ఆ ఇంటర్మీడియట్లు, ఏపీఐలపై దృష్టి సారిస్తుంది. పీఎంఈసీ ఇండియా క్లీన్‌రూమ్ టెక్నాలజీ, యంత్రాలు ఆ పరికరాలు, ప్యాకేజింగ్, లాబొరేటరీ ఆ అనలిటికల్ ఎక్విప్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. ఈ రెండు ప్రదర్శనల ద్వారా 2026 ఎడిషన్ ఫార్మాస్యూటికల్ తయారీదారులు, పదార్థాల కంపెనీలు (ఇంగ్రీడియంట్స్), మెషినరీ నిపుణులు, సాంకేతిక ప్రదాతలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తుంది. ఫార్ములేషన్లు, ఏపీఐలు, ఎక్సిపియంట్లు, ఫైన్ కెమికల్స్, ఇంటర్మీడియట్ల రంగాల నుంచి డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్, హెటెరో లాబ్స్ లిమిటెడ్, మ్యాట్రిక్స్ ఫార్మా కార్ప్, మోర్‌పెన్ లాబొరేటరీస్, అకుమ్స్ డ్రగ్స్, జూబిలెంట్ ఇంగ్రేవియా, అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, విర్చో గ్రూప్, ఓషియానిక్ ఫార్మాకెమ్ ప్రైవేట్ లిమిటెడ్, సెక్మెట్ ఫార్మావెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, దివీస్ లాబొరేటరీస్ వంటి దిగ్గజ సంస్థలు సీపీహెచ్ఐ ఇండియాలో పాల్గొననున్నాయి. ఫార్మా యంత్రాలు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, క్లీన్‌రూమ్, లాబొరేటరీ ఆ అనలిటికల్ టెక్నాలజీల విభాగాల నుంచి ఏసీజీ, ఫెట్టె కాంపాక్టింగ్ మెషినరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కాడ్‌మాచ్ మెషినరీ కో. ప్రైవేట్ లిమిటెడ్, జీఈఏ ప్రాసెస్ ఇంజనీరింగ్, మార్చెసిని గ్రూప్ ఎస్పీఏ, ఆప్టెల్ విజన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెస్ట్ ఫార్మాస్యూటికల్స్ ప్యాకేజింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఐఎంఏ ఇండస్ట్రియా మెషీన్ ఆటోమాటికే ఎస్పీఏ, స్టాండర్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, జీఎంపీ టెక్నికల్ సొల్యూషన్స్, థర్మో ఫిషర్ సైంటిఫిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, షిమాడ్జు ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలను పీఎంఈసీ ఇండియా ఒకే చోటకు చేర్చనుంది.



ఈ ప్రదర్శనలకు ఫార్మాస్యూటికల్స్ ఎగుమతి ప్రోత్సాహక మండలి, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ప్రొడ్యూసర్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా ఎంటర్‌ప్రెన్యూర్స్ వంటి ముఖ్యమైన సంస్థలు మద్దతు ఇవ్వనున్నాయి. కేవలం ప్రదర్శనా ప్రాంతానికే (ఎగ్జిబిషన్ ఫ్లోర్) పరిమితం కాకుండా, లీడర్స్ రౌండ్ టేబుల్స్, ప్రత్యేక నెట్‌వర్కింగ్ సెషన్లు, 'ఉమెన్ ఇన్ ఫార్మా', ప్రత్యేక ఎగ్జిబిషన్ జోన్లు, లైవ్ టెక్నాలజీ ప్రదర్శనలు, విస్తృతమైన అంతర్జాతీయ భాగస్వామ్యాలు ఈ ఎడిషన్‌లో చోటు చేసుకోనున్నాయి. ఇవి కొనుగోళ్లు, వ్యాపార విస్తరణ, జ్ఞాన మార్పిడి, పరిశ్రమల మధ్య చర్చలకు అనేక వేదికలను సృష్టిస్తాయి. ఈ సమావేశంలో ఫార్మాస్యూటికల్స్ ఎగుమతి ప్రోత్సాహక మండలి డైరెక్టర్ జనరల్ రాజా భాను, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ ఆ సీఈఓ సర్వేష్ సింగ్, సత్‌గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ హెల్త్‌కేర్ ఆ లైఫ్‌సైన్సెస్ అడ్వైజరీ డైరెక్టర్ పుష్ప విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.


భారతదేశంలో విస్తరిస్తున్న సీడీఎంఓ అవకాశాలు, ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ వైపు మళ్లడం, సవరించిన 'షెడ్యూల్ ఎం' కింద మారుతున్న నాణ్యత-పాటింపు (క్వాలిటీ ఆ కాంప్లైయన్స్) నిబంధనలు, సాంకేతికత, పెట్టుబడుల ప్రాధాన్యతలు, దేశ ఫార్మా వృద్ధిలో తెలంగాణ విస్తరిస్తున్న పాత్రపై ఈ చర్చ ప్రధానంగా సాగింది. ఈ చర్చలో నాణ్యత, నిబంధనల పాటింపు (కాంబినేషన్) మరొక ముఖ్యమైన అంశంగా నిలిచింది. మంచి తయారీ ప్రామాణికాలు (గుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్), ప్రాంగణాలు, ప్లాంట్, పరికరాలకు సంబంధించి సవరించిన 'షెడ్యూల్ ఎం' నిబంధనలు ఇప్పుడు ఫార్మాస్యూటికల్ తయారీదారులందరికీ వర్తిస్తాయి. ఈ నిబంధనలు రూ.250 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్న తయారీదారులకు జూన్ 2024 నుంచి అమల్లోకి రాగా, చిన్న తయారీదారులకు ఇచ్చిన గడువు పొడిగింపు ముగియడంతో, ఇప్పుడు రూ.250 కోట్లు అంతకంటే తక్కువ టర్నోవర్ ఉన్న సంస్థలు కూడా వీటిని అమలు చేస్తున్నాయి.

అవయవదానం కొత్త జీవితాన్ని ప్రసాదించే గొప్ప కార్యం: డాక్టర్ శ్రీ భూషణ్ రాజు

హైదరాబాద్, : ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా, హైదరాబాద్ కవాడిగూడలోని సిజీవో టవర్స్ వేదికగా 'అవయవ దానం: అపోహలు - వాస్తవాలు' అంశంపై 'వార్త' పేరుతో మీడియా కార్యశాలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నిర్వహించింది. నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నెఫ్రాలజీ విభాగం ప్రొఫెసర్, అధిపతి... ఎన్‌వోటీటీవో (జీవన్‌దాన్) విభాగ అధిపతి డాక్టర్ శ్రీ భూషణ్ రాజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పీఐబీ, హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ (ఐఐఎస్) ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ "దేశంలో అవయవ మార్పిడికి ఉన్న డిమాండ్, దాతల ద్వారా అందుబాటులో ఉన్న అవయవాల మధ్య గణనీయ వ్యత్యాసం ఉంది. అవయవ దానాన్ని, మార్పిడి ప్రక్రియలను సమన్వయం చేయడంలోనూ, ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించడంలోనూ ఎన్‌వోటీటీవో, ఎస్‌వోటీటీవోలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. 'వార్త' వంటి మీడియా కార్యశాలల ద్వారా... అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించడంతో పాటు, ఈ అపోహలకు-వాస్తవిక వైద్యపరమైన అంశాలకు మధ్య వ్యత్యాసాన్ని వివరించే సమాచారాత్మక సదస్సులను మేం నిర్వహిస్తున్నాం" అన్నారు.

నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నెఫ్రాలజీ ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ శ్రీ భూషణ్ రాజు ప్రసంగిస్తూ... "మరణించిన వ్యక్తి మరొక వ్యక్తికి జీవితాన్ని అందించగల ఒక ఉదాత్తమైన చర్యగా అవయవ దానాన్ని మనమంతా... ఈ ప్రపంచ అవయవ దాన దినోత్సవ సందర్భంగా



గుర్తించాలి. అవయవ మార్పిడిలో వైద్య శాస్త్రం అద్భుతమైన పురోగతి సాధించినప్పటికీ, మానవ అవయవాలను పూర్తిగా తిరిగి సృష్టించడం ఇంకా సాధ్యం కాలేదు. అందుకే దాతలు, వారి కుటుంబాల ఉదారత ఎంతో అమూల్యమైనది" అన్నారు.

అవయవ మార్పిడిలో ఉండే సంక్లిష్టతలను వివరిస్తూ... మార్పిడి చేసిన అవయవాన్ని మానవ రోగనిరోధక వ్యవస్థ సహజంగానే ఒక అన్య పదార్థంగా గుర్తించి, దానిని తిరస్కరించడానికి ప్రయత్నిస్తుందని ఆయన పేర్కొన్నారు. 'వైద్య రంగంలో వచ్చిన పురోగతి వల్ల ఈ రోగనిరోధక ప్రతిస్పందనను నియంత్రించడం, అవయవ మార్పిడి ఫలితాలను మెరుగుపరచడం సాధ్యమైంది. ఈ తిరస్కరణను నివారించడం, గ్రహీతను ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడం మధ్య ఒక సున్నితమైన సమతుల్యతను కాపాడుకోవడం ఇప్పటికీ ఒక ముఖ్యమైన సవాలుగానే ఉంది' అని డాక్టర్ శ్రీ భూషణ్ రాజు తెలిపారు.

"అవయవ మార్పిడి విజయం అంతిమంగా అవయవాల లభ్యతపైనే ఆధారపడి ఉంటుంది. వైద్య శాస్త్రం అధునాతన మార్పిడి విధానాలు, ఔషధాలను అభివృద్ధి చేసినప్పటికీ... అవయవాలను కర్మాగారాల్లో తయారు చేయడం సాధ్యం కాలేదు. అందువల్ల, అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగులకు కొత్త జీవితాన్ని పొందేందుకు అవయవ దానం అత్యంత కీలకం" అని ఆయన తెలిపారు.

ఎన్‌వోటీటీవో, ఎస్‌వోటీటీవోలతో కలిసి మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం (టీహెచ్‌వోటీఏ)... దేశంలో అవయవ దానం, మార్పిడిల నియంత్రణ, బలోపేతం కోసం ఒక ముఖ్యమైన విధాన ప్రణాళికను అందిస్తోందని ఆయన స్పష్టం చేశారు. జాతీయ కార్యక్రమాలు, అవగాహన ప్రచారాలు, పారదర్శక అవయవ కేటాయింపు వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అవయవ దానాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సహా దాని పాత్రనూ డాక్టర్ శ్రీ భూషణ్ రాజు ప్రముఖంగా ప్రస్తావించారు. అవయవ దానాన్ని ప్రోత్సహించడం, మార్పిడిని సులభతరం చేయడం, అంతిమంగా అవయవ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు పునర్జన్మను అందించడం ఈ ప్రయత్నాల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

అవయవ దానానికి సుముఖంగా ఉన్నప్పటికీ, వారి కుటుంబ సభ్యుల అవయవాలు వైద్యపరంగా నరిపోలని రోగుల విషయంలో స్వాప్-ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక కీలకమైన ఎంపిక అవుతుందని డాక్టర్ భూషణ్ రాజు స్పష్టం చేశారు. ఇటువంటి సందర్భాల్లో తగిన చట్టపరమైన, వైద్యపరమైన నిబంధనలకు అనుగుణంగా పరస్పరం సరిపోలే దాత-గ్రహీత జంటలను కలపవచ్చని ఆయన వివరించారు. గతంలో అవయవ దానాన్ని ప్రధానంగా వైద్యపరమైన లేదా శాస్త్రీయ అంశంగానే పరిగణించేవారనీ... ఇది క్రమంగా ఆర్థిక, కుటుంబపరమైన అంశాలతో కూడిన సామాజిక అంశంగా మారుతూ, ప్రస్తుతం డిమాండ్-సరఫరాల మధ్య అంతరానికి కారణమవుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ అంతరాన్ని పూడ్చడానికి, అవయవ దానాన్ని బహిరంగ చర్చల్లోకి తీసుకురావాలన్నారు. మరింత అవగాహనను, సమ్మతిని కల్పించడానికి కుటుంబాలు, సమాజాల మధ్య చర్చలను ప్రోత్సహించాలని డాక్టర్ భూషణ్ రాజు సూచించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ గేర్.

గులాబీ గూటివైపు చూపులు?

హైదరాబాద్, ఆగస్టు 13 (న్యూస్ పల్స్)బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గాలకు భారీగా నిధులు వస్తాయని, పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన పలువురు ఎమ్మెల్యేలకు అనుకున్న స్థాయిలో ఫలితం కనిపించకపోవడంతో అసంతృప్తి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేయాలనే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం ఊపందుకుంది.ఈ క్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరి తర్వాత మరికొందరు కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సంప్రదింపులు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం ఉన్నా.. దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత రాలేదు.కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. తాను మంత్రి పదవి కోసం, డబ్బు కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని ఆయన స్పష్టం చేశారు. అయితే తాను ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్న అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పోచారం గుర్తు చేశారు. కానీ ఆ హామీలు పూర్తిగా అమలు కాలేదన్న భావన ఆయన వ్యాఖ్యల్లో వ్యక్తమైంది.మంత్రులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా సీఎం మాటలను పట్టించుకోవడం లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని అంతర్గత పరిస్థితులపై చర్చకు దారితీశాయి. సీఎం స్వయంగా చెప్పినా పనులు జరగడం లేదని, ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే వేం నరేందర్‌రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదని పోచారం పేర్కొన్నట్లు సమాచారం.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా గెలిచి, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ కండువా కప్పుకున్న పదిమంది ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. ప్రధానంగా బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇటీవల కామారెడ్డి జిల్లా బీర్కూరు ఆత్మీయ సమావేశంలో చేసిన తీవ్ర వ్యాఖ్యలు కాంగ్రెస్ అంతర్గత కలహాలను బహిర్గతం చేశాయి. "నేను మంత్రి పదవి కోసమో, నిధుల కోసమో పార్టీ మారలేదు.. కేవలం బాన్సువాడ అభివృద్ధి కోసమే వచ్చా. కానీ, ఆరు నెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి హామీలు అమలు కావడం లేదు" అని ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చివరికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా ఫోన్లు ఎత్తడం లేదని ఆయన చేసిన ఆరోపణలు ప్రభుత్వంలో ఫిరాయింపుదారులకు దక్కుతున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. పోచారం శ్రీనివాసరెడ్డి మాత్రమే కాదు, పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్న చర్చ జరుగుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని, గత పాలనను ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారితీశాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సోదరుడు బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేసి మంచి ఫలితాలు సాధించడం, గూడెం 'ఘర్ వాపసీ'కి సంకేతంగా భావిస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిలు సైతం తమ నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు.ఫిరాయింపు ఎమ్మెల్యేల తిరుగుబాటు సంకేతాలతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. కాంగ్రెస్ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. అయితే, ఒకవైపు పాత కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత, మరోవైపు నిధుల లేమితో ఫిరాయింపు ఎమ్మెల్యేలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు కీలక ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం జోరందుకుంది.అధికార పార్టీ కండువా కప్పుకున్న వేళ కనిపించిన ఉత్సాహం ఇప్పుడు ఆవిరైపోయింది. సొంత నియోజకవర్గాల్లో ప్రజలకు ముఖం చూపించలేక ఈ ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అయితే పార్టీ మారిన తర్వాత కూడా కాంగ్రెస్‌లో వారికి పూర్తి స్థాయి రాజకీయ స్థానం దక్కలేదన్న అసంతృప్తి ఉందని వారి అనుచర వర్గాలు చెబుతున్నాయి.నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్థానిక నేతలు, అనుచరుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అధికార పార్టీలోకి వెళ్లిన తర్వాత నిధులు, అభివృద్ధి పనులు వేగంగా వస్తాయని భావించినా.. చాలా చోట్ల పనులు ముందుకు కదలకపోవడం ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆయన సోదరుడు బీఆర్ఎస్‌లో చేరడం, ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పనిచేయడం రాజకీయంగా చర్చకు దారితీసింది. పటాన్‌చెరు పరిధిలో బీఆర్ఎస్ మెరుగైన ఫలితాలు సాధించడంతో గూడెం రాజకీయ వైఖరిపై మరింత ఆసక్తి ఏర్పడిందిజగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడా నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కీలక రోడ్డు పనులు పార్టీ మారి రెండేళ్లు గడిచినా ఆశిం చిన స్థాయిలో ముందుకు సాగకపో వడం ఆయనకు ఇబ్బందిగా మారిందని స్థానిక వర్గాలు చెబుతు న్నాయి .గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. గుర్రం లిఫ్ట్ పథకం పనులు చేపట్టడంతో పాటు పలు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచితే నియోజకవర్గానికి ప్రయోజనం కలుగుతుందని ఆయన భావిస్తున్నా రు. అయితే ఈ పనుల్లో జాప్యం జరుగుతుండటం ఆయనను కూడా అసంతృప్తికి గురిచేస్తున్నట్లు సమాచారం.ఫిరాయింపు ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ అంశంపై ఆరాతీసినట్టు సమాచారం. పోచారం వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు.

మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

హైదరాబాద్, ఆగస్టు 13(న్యూస్ పల్స్)హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్క్‌గా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లల్లో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్-బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్-జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది.దాదాపు ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ.699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఉక్కు వంతెనల నిర్మాణం వల్ల భూసేకరణ ఖర్చు తగ్గుతుందని, తక్కువ స్థలంలోనే పనులు చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కేబీఆర్ పార్క్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ తగ్గుతుంది. సిగ్నల్ ఫ్రీ జర్నీ వాహనదారులకు లభించనుంది. హైటెక్ సిటీ, ఫిల్మ్ నగర్ వె?పు వెళ్లేవారు వేగవంతంగా చేసుకోవచ్చు.

బండికి కీలక బాధ్యతలు



హైదరాబాద్, ఆగస్టు 13 (న్యూస్ పల్స్)తెలంగాణలో ఏలాగైనా అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే రాబోయే అసెంబ్లీ సమరానికి పార్టీని సిద్ధం చేసేందుకు నేతృత్వంలో మార్పులు ఉంటాయా, లేక ప్రస్తుత సారథ్యాన్నే కొనసాగిస్తారా అనే అంశం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును తప్పించి, గతంలో పార్టీని పరుగులు తీటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.రాజకీయ వర్గాల్లో బండి సంజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ, బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి మాత్రం నాయకత్వ మార్పుపై స్పష్టమైన సంకేతాలేవీ వెలువడలేదు. షెడ్యూల్ ప్రకారం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028లో జరగాల్సి ఉంది. ఒకవేళ కేంద్రం ప్రతిపాదిస్తున్న 'జమిలి' విధానం అమల్లోకి వస్తే, ఇవి 2029 మే లేదా జూన్ నాటికి మారే అవకాశం ఉంది. ఈ లెక్కన ప్రస్తుత అధ్యక్షుడు రాంచందర్ రావు పదవీకాలం ఇంకా సుమారు రెండేళ్లకు పైగా ఉంది. ఎన్నికలకు ఇంకా తగినంత సమయం ఉన్నందున, ఇప్పుడు హడావుడిగా అధ్యక్షుడిని మార్చడం వల్ల పార్టీలో నూతన అసంతృప్తులు, సమన్వయ లోపాలు తలెత్తే ప్రమాదం ఉందని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో కేవలం బండి సంజయ్ మాత్రమే కాకుండా మరికొందరు అగ్రనేతలు కూడా ఉన్నారు. తెలంగాణలో బీజేపీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లిన అనుభవం బండి సంజయ్ కి ఉంది. కార్యకర్తలలో ఉన్న విపరీతమైన క్రేజ్, అధికార పార్టీకి గట్టి పోటీ ఇవ్వగలరనే నమ్మకం ఆయనకు సానుకూల అంశాలు. ఇక ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు కూడా పార్టీ అధ్యక్ష పీఠం ఆశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మంచి పట్టున్న ఈ సీనియర్ ఎంపీలు కూడా అధ్యక్ష బాధ్యతల కోసం జాతీయ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.అయితే నూతన అధ్యక్షుడిని నియమిస్తే, ఆయన రాష్ట్రవ్యాప్తంగా పార్టీపై పూర్తి పట్టు సాధించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విరామం ఎన్నికల సమయానికి పార్టీకి ప్రతికూలంగా మారవచ్చని కొందరు విశ్లేషిస్తున్నారు. అందుకే అధ్యక్షుడిని మార్చడం కంటే, రాంచందర్ రావునే పదవిలో కొనసాగిస్తూనే.. రేసులో ఉన్న ఇతర కీలక నేతలకు వివిధ కీలక బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయడం, బలమైన సామాజిక వర్గాలను బీజేపీ వైపు తిప్పుకోవడం, నాయకుల మధ్య సమన్వయాన్ని పెంచడంపైనే పార్టీ దృష్టి సారిస్తోంది.మొత్తానికి, బండి సంజయ్ లేదా ఇతర నేతల పేర్లు ఎంతగా ప్రచారంలో ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి రాంచందర్ రావు నేతృత్వంలోనే కమలనాథులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 'జమిలి' నిర్ణయం, మారే రాజకీయ సమీకరణాలను బట్టి చివరి నిమిషంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి!

మండలిలో జెన్ జీ...

వరంగల్, ఆగస్టు 13 (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయం ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసినా.. ఇప్పుడు రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. సాధారణంగా ఎన్నికల సమయానికి కొన్ని నెలల ముందు హడావుడి కనిపించడం సహజం, కానీ ఈ సారి ఏకంగా ముందే ప్రధాన రాజకీయ పార్టీల తరఫున యువ నాయకులు, కొత్తతరం ఆశావాహులు క్షేత్రస్థాయిలో పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ స్థానాల్లో విద్యావంతులు, యువత ఓటర్లుగా ఉండటంతో సాంప్రదాయ రాజకీయ సీనియర్ల కంటే ఫైర్‌బ్రాండ్ నాయకత్వం, విద్యాధికులైన యువ నేతల వైపే పార్టీలు మరియు ఓటర్లు మొగ్గు చూపే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రాబోయే కాలంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రస్తుతం బీఆర్ఎస్ నేత సురభి వాణీదేవి ప్రాతిపదికన ఉన్న ఈ సీటు గడువు 2027 మార్చితో ముగుస్తుంది. రాజధాని నగరం, ఐటీ కారిడార్ విస్తరించి ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడ గెలుపు పార్టీల ప్రతిష్టకు ప్రతీకగా మారింది. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గతంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. కానీ ఆయన ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిదగా తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. ఆయన ను కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. ఈసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోటీల్లో పాత తరం నేతల కంటే యువత, సోషల్ మీడియా ప్రభావం ఉన్న నాయకులే ప్రముఖంగా వినిపిస్తున్నారు. టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్, అధికార ప్రతినిధిగా కాంగ్రెస్ వైఖరిని గట్టిగా వినిపిస్తున్న సామ రామ్మోహన్ రెడ్డి ఈసారి కాంగ్రెస్ తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రేసులో బలమైన అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి, గడిచిన కొన్నేళ్లుగా టీవీ డిబేట్లు, క్షేత్రస్థాయి ఉద్యమాల ద్వారా యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారాయన. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ లేదా మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధి నుంచి ఆయన పోటీ చేసే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. విద్యాధికుడైన రాకేష్ రెడ్డి గత వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపఎన్నికలో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి హోరాహోరీ పోరాటం ఇచ్చారు. ఉపఎన్నికలో స్వల్ప తేడాతో ఓడినప్పటికీ లక్షకు పైగా మొదటి ప్రాధాన్యత ఓట్లను సాధించి తన సత్తా చాటారు. రాబోయే ఎమ్మెల్సీ సమరంలో ఆయన మళ్లీ ప్రధాన పోటీదారుడిగా నిలబడేందుకు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి పట్టభద్రుల ఎన్నికలు ఓ రకంగా పనితీరుకు పరీక్షగా మారనున్నాయి. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, గ్రూప్స్ నియామకాలపై విద్యావంతుల్లో ఉన్న అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకే అగ్రెసివ్ కాన్ఫిడెంట్ ఉన్న యువ ముఖాలను బరిలోకి దింపే యోచనలో ఉంది. మరోవైపు, కోల్పోయిన కేడర్ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువ గ్రాడ్యుయేట్లను, విద్యాధికులను ముందు వరుసలో నిలబెడుతున్నారు. ఇక బీజేపీ తన అర్బన్ ఓట్ బ్యాంక్, హిందుత్వ కేడర్‌తో పాటు విద్యావంతుల మద్దతుతో రెండు స్థానాల్లో సత్తా చాటాలని గ్రౌండ్ వర్క్ వేగవంతం చేసింది.త్వరలో ఎన్నికల సంఘం ఓటర్ నమోదు ప్రక్రియ ప్రారంభించే అకాశం ఉంది. అప్పటి నుంచే అసలు వార్ ప్రారంభం కనుంది. రాకేష్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి వంటి సోషల్ మీడియా లీడర్లు ఇప్పటికే వందలాది ఐటీ నిపుణులు, నిరుద్యోగులతో డైరెక్ట్ కనెక్ట్ సాధిస్తుండటం ఈ కొత్తతరం రాజకీయాన్ని తెలియజేస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుపోటములను నిర్ణయించేది రెండు ప్రధాన అంశాలు. మొదటిది మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్ల ప్రాసెస్ అయితే, రెండోది ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు . ఉద్యోగ ప్రకటనల అమల్లో జాప్యం జరిగితే అది అధికార పార్టీ అభ్యర్థులకు ప్రతికూలంగా మారే ముప్పు ఉంటుంది. అదే సమయంలో ప్రతిపక్షాలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా సరైన ప్రత్యామ్నాయ అజెండాను చూపిస్తే తప్ప పట్టభద్రుల ఓట్లను ఆకర్షించలేవు. ఈ సమీకరణాల మధ్య రాబోయే గ్రాడ్యుయేట్ సమరం తెలంగాణ రాజకీయాల్లో ఒక ట్రెండ్ సెట్టర్‌గా మారబోతోంది.

మాస్ డ్యాన్స్ తో షేక్ చేస్తున్న ప్రీతిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 13, (న్యూస్ పల్స్) ఎక్స్ మినిస్టర్ మల్లారెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన ఏం మాట్లాడినా సరే సంచలనంగానే ఉంటుంది. సోషల్ మీడియాలో ఆయన చేసే కామెంట్లు.. వేసే డ్యాన్సులు.. ఇవన్నీ కూడా ట్రెండింగ్లో ఉంటాయి. మల్లారెడ్డి మాత్రమే కాదు.. ఇప్పుడు ఆయన కోడలు కూడా మామ చూపించిన దారిలోనే నడుస్తున్నట్టు తెలుస్తోంది.మల్లారెడ్డికి ఇద్దరు కుమారులు. అందులో భద్రారెడ్డి సతీమణి ప్రీతి రెడ్డి. ఈమె మల్లారెడ్డి విద్యాసంస్థలను పర్యవేక్షిస్తూ ఉంటారు. ఈమెకు సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉండడం చాలా ఇష్టం. సోషల్ కార్యక్రమాలు కూడా చేపడుతూ ఉంటారు. మల్లారెడ్డి తరహాలోనే కామెంట్లు చేస్తూ ఉంటారు. ఈమె మాట్లాడే మాటలు.. చేసే డ్యాన్సులు ఆసక్తికరంగా ఉంటాయి. అప్పట్లో ఈమె తన మామతో కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. చాలాసేపు మాట్లాడుకున్నారు. అప్పట్లోనే ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతుందని వార్తలు వచ్చాయి.గత ఏడాది బోనాల వేడుకలు జరిగినప్పుడు బిజెపి ఎంపీ.. కేంద్రమంత్రి బండి సంజయ్ తో కలిసి ఆమె కార్యకర్త ఇంటికి వెళ్లారు. అక్కడ భోజనం కూడా చేశారు. ఈమె పేరు మీద అక్కడి బిజెపి కార్యకర్తలు ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. దీంతో ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతున్నారని ప్రచారం జరిగింది. అయితే దీనిని ఆమె ఖండించలేదు. అలాగని స్వాగతించలేదు.ప్రీతి రెడ్డి నిత్యం మీడియాలో కనిపిస్తూనే ఉంటారు. సోషల్ ఆక్టివిటీ గాని.. ధార్మిక కార్యక్రమాలు గాని.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు గాని.. కాలేజీకి సంబంధించిన కార్యక్రమాలు గాని. ఇలా అన్నిట్లో ఆమె పాలుపంచుకుంటూనే ఉంటారు. ఆమె డ్యాన్సులు బాగా చేస్తారు. హైదరాబాదులో జరిగిన బోనాల వేడుకలో ప్రీతి రెడ్డి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచారు. అంతేకాదు నెత్తికి తలపాగ చుట్టి.. బంగారు ఆభరణాలు ధరించి.. అమ్మవారి పాటలకు లయబద్ధంగా డ్యాన్సులు వేశారు. సోషల్ మీడియాలో మరోసారి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అయ్యారు

బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్.. రూ.5 కోట్లు లాస్

హైదరాబాద్, ఆగస్టు 13 (న్యూస్ పల్స్)హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనం సృష్టిస్తూ కోకాపేట ప్లాట్ నంబర్ 17లో 4.59 ఎకరాల భూమికి ఎకరాకు రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ వేసిన వజ్రా కన్‌స్ట్రక్షన్స్ చెల్లింపులు చేయలేకపోయింది. దీంతో వేలం నిబంధనల ప్రకారం హెచ్ఎమ్‌డీఏ సదరు సంస్థ చెల్లించిన రూ. 5 కోట్ల ఈఎమ్‌డీ డిపాజిట్‌ను జప్తు చేసింది. ప్రీ-లాంచ్ విక్రయాల ద్వారా నిధులు సమీకరించాలనే వ్యూహం ఫలించకపోవటంతో భూమితో పాటు డిపాజిట్‌నూ సదరు సంస్థ కోల్పోయింది. కాగా, ఈ భూమిని మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన కోకాపేట నియోపొలిస్ భూముల వేలంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వేలంలో రికార్డు స్థాయిలో భారీ బిడ్ వేసి ప్లాట్‌ను దక్కించుకున్న వజ్రా కన్‌స్ట్రక్షన్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్ణీత గడువులోగా నిధులు చెల్లించలేక చేతులెత్తేసింది. దీంతో వేలం నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ.. హెచ్ఎండీఏ సదరు నిర్మాణ సంస్థ భద్రతా డిపాజిట్‌గా చెల్లించిన రూ. 5 కోట్ల అర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఓఆ)ని జప్తు చేసింది.కోకాపేట ప్లాట్ నంబర్ 17లోని 4.59 ఎకరాల భూమికి వజ్రా కన్‌స్ట్రక్షన్స్ ఎకరాకు ఏకంగా రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ దాఖలు చేసి భూములు దక్కించుకుంది. ఈ లెక్కన ఆ భూమి మొత్తం విలువ రూ. 626 కోట్లకు పైగానే ఉంటుంది. అయితే, భూమి కొనుగోలుకు అవసరమైన పూర్తి ఆర్థిక ఇన్వెస్ట్‌మెంట్ సొంతంగా లేనప్పటికీ.. ప్రాజెక్టు ప్రకటించి ప్రీ-లాంచ్, ఓపెన్ టు పబ్లిక్ విక్రయాల ద్వారా కొనుగోలుదారుల నుంచి ముందస్తుగా నిధులు సమీకరించి ప్రభుత్వానికి చెల్లించవచ్చని ఆ సంస్థ భావించింది. అయితే మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రీ-లాంచ్ విక్రయాలు జరగకపోవడంతో ఆ వ్యూహం ఫలించలేదు.నిర్ణీత గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవటంతో రూ. 5 కోట్ల డిపాజిట్‌ను హెచ్ఎండీఐ జప్తు చేసింది. ఫలితంగా వజ్రా కన్‌స్ట్రక్షన్స్ రూ. 600 కోట్లకు పైగా విలువైన కోకాపేట స్థలంతో పాటు రూ. 5 కోట్ల నగదును కోల్పోయి రెండు రకాలుగా నష్టాన్ని మూటగట్టుకుంది. భవిష్యత్ ప్రాజెక్టు విక్రయాలను నమ్ముకొని ఆర్థిక సామర్థ్యానికి మించి బిడ్లు వేయడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేస్తోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. చెల్లింపులు జరగని నేపథ్యంలో ప్లాట్ నంబర్ 17 కింద ఉన్న 4.59 ఎకరాల స్థలానికి త్వరలోనే మళ్లీ పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. గత వేలంలో ఎకరాకు 136.50 కోట్ల కోట్లకు పైగా పలుకగా.. కొత్త వేలంలో ఈ స్థలానికి ఎలాంటి ధర నమోదవుతుందనేది ఇప్పుడు నగర రియల్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.కోకాపేట్‌లోని నియోపొలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి హెచ్ఎండీఏ సిద్ధమైంది. నిధుల సమీకరణే లక్ష్యంగా వేలానికి రెడీ అయ్యారు.

మంత్రి తుమ్మలను కలిసిన పీఏసీఎస్ ఛైర్మన్లు

కరీంనగర్, కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నూతన ఛైర్మన్లు బుధవారం టీపీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఈ భేటీ జరిగింది.ఈ సందర్భంగా నూతన ఛైర్మన్లు మంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.

కొడంగల్ ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై లోకాయుక్తకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల ఫిర్యాదు



నారాయణపేట : నారాయణపేట, వికారాబాద్ జిల్లాల పరిధిలో చేపడుతున్న మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గురువారం లోకాయుక్తకు ఫిర్యాదు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు , మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి , మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో నారాయణపేట మండలం పేరపల్ల గ్రామ శివారులో చేపట్టిన భూముల సేకరణలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపించారు.నకిలీ పాస్‌బుక్ లతో నష్ట పరిహారాన్ని కాజేసేందుకు కాంగ్రెస్ నాయకులు పన్నాగం పన్నారని విమర్శించారు. పేరపల్ల శివారులోని జయమ్మ చెరువులో నీరు నిల్వ చేయడం వల్ల కొంత మంది రైతులకు సంబంధించి భూములు కొల్పోకున్న, భూములు కోల్పోతున్నట్లు పేర్కొనడం, సర్వే నంబర్లూ ఒక చోట ఉంటే భూములు ఒక చోట ఉన్నట్లు అధికారులు చెప్పడం రైతులను అయోమయానికి గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్టు పనుల్లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.విచారణలో అవినీతి, అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు తేలితే సంబంధిత అధికారులపై, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ప్రతి రూపాయి ప్రజాధనం సక్రమంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లోకాయుక్త విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి గురించి ఉన్నదే మాట్లాడా..? : ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



అనవసరంగా కాంగ్రెస్‌లో చేరాను.. 6 నెలల్లో బాన్సువాడలో పెండింగ్ సమస్యలు తీరుస్తానని రేవంత్ రెడ్డి చెబితేనే జాతీయ కండువా కప్పుకున్నానంటూ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఓ సమావేశంలో మరోసారి రేవంత్ గురించి పోచారం చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.రేవంత్ రెడ్డి గురించి ఉన్నదే మాట్లాడా.. అందులో రహస్యమేం లేదు.. నా ప్రజల కోసం నా జీవితం.. ప్రజల సంక్షేమం కోసమే నా ఆలోచన. కార్యకర్త బాధలను తీర్చాలనేదే నా ఆలోచన. దాని కనుగుణంగా నేను పనిచేయాల్సి వస్తుంది తప్పితే.. నేను ప్రజల కోసం పార్టీ మారాను.. డబ్బుల కోసం కాదునాకు ఎవరూ డబ్బులు ఇవ్వలేదు, నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు.. నాకు ఎలాంటి స్వార్థం లేదన్నారు పోచారం.స్వార్థమనేది ఉంటే నేను రాజకీయం వదులుకుంటా.. కానీ ఇటువంటి దౌర్భాగ్యం పని నేను చేయను. పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్యమంత్రిని ఉత్తగనే కలిసిండా.. ఆయనకేదో స్వార్థం ఉందా.. అని రోజూ అంటరు. ఒకటి చెప్పండి ఏదైనా స్వార్థం ఉంటే నాకేమైనా డబ్బులు ఇచ్చిర్రా.. నేనేమైనా అమ్ముడుపోయిన్నా. అదే విషయం తెలియడానికి మాట్లాడినా.. వాస్తవం చెప్పాలంటే ఈ ఫంక్షన్ హాల్ ఇచ్చిరు. చెప్పాల్సి వస్తది.. అన్నంపెట్టినోడిని మరుస్తమా..? ఈ ఫంక్షన్ హాల్ కేసీఆర్ వల్ల వచ్చింది.. చెప్పొద్దా..? నా ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏదైనా చేస్తా.. అంటూ చెప్పుకొచ్చారు

'దళిత డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి'

తుంగతుర్తి, ఆగస్టు 13 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేవెళ్లలో ప్రకటించిన దళిత డిక్లరేషనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్ఎస్ శ్రేణులు తుంగతుర్తి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సీతయ్య మాట్లాడుతూ.. ప్రతి దళిత కుటుంబానికి అభయహస్తం కింద రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా ఇవ్వలేదని మండిపడ్డారు. దళితులకు ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని రమేశ్ పూర్ణ నాయక్, వీరోజీ నాయక్, సుధాకర్ నాయక్, సర్పంచ్ తప్పేట్ల ఎల్లయ్య, మాతంగి కరుణాకర్, ఆకారపు భాస్కర్, కదారిదాసు, పోలెపాక సోమయ్య, బల్లెం ప్రవీణ్, చింతకుంట్ల భాస్కర్, శ్రీనివాస్, పరమేశ్, గడ్డం సోమేశ్, మల్లేపాక కరుణాకర్, దుబ్బాక విజయ్, శ్రావణ్, పుల్లూరి పరశురాం, బొంకూరి శ్యాంసుందర్, కొండగడుపుల వెంకటేష్, బొంకూరి సాయి, పోలేపాక పరమేశ్ పాల్గొన్నారు.




70 లక్షలకో ఉద్యోగం.. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బాగోతం



రాంచీ: జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ నియామక ప్రక్రియలో జరిగిన కుంభకోణంపై విద్యార్థులు కొన్ని వారాలుగా ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 20 మందిని ఆ రాష్ట్ర క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (అఐఆ) అరెస్ట్ చేసింది. వారిలో పరీక్షల నిర్వహణ ఏజెన్సీ అయిన టీడీపీఎల్ (మార్కెటింగ్ మేనేజర్ అభయ్ తివారీ ఒకరు. ఆయన ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై పోలీసులకు వెల్లడించారు.తాము అడిగిన డబ్బులు చెల్లించినవారికి ఉద్యోగం ఇప్పించేందుకు ప్రణాళిక చేపట్టాం. దీనిలో టీడీపీఎల్ డైరెక్టర్ రామ్‌వీర్ సింగ్, జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఎల్ ఖియాంగ్టే, జేపీఎస్‌సీ సభ్యులు అజితా భట్యాచార్య, డాక్టర్ జమాల్ అహ్మద్, డాక్టర్ అనిమా హస్స్‌దా భాగస్వాములుగా ఉన్నారు. ఏజెంట్లు, మధ్యవర్తులు అభ్యర్థులను ఖరారు చేసేవారు. వారిని ఒక ఏజెంట్ ఆదిత్య పాండే టీడీపీఎల్ రామ్‌వీర్ సింగ్‌కు పరిచయం చేశారు. ఆయన వారిని కమిషన్ సభ్యుల వద్దకు పంపి ఇంటర్వ్యూ బోర్డును ఫిక్స్ చేసుకుని ఫైనల్ మార్కులు పెరిగేలా ప్రణాళిక రచించాం అని అభయ్ వెల్లడించారు.జేపీఎస్‌సీ నిర్వహించిన 12, 13 పరీక్షల్లోని లెవల్స్‌ను బట్టి ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 15 లక్షల వరకు తీసుకున్నాం. అలా ఇంటర్వ్యూ వరకు సుమారు రూ. 60 లక్షల నుంచి రూ. 70 లక్షల వరకు వసూలు చేశాం అని తెలిపారు. ఈ స్కామ్ ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన ముగ్గురి పేర్లను వెల్లడించారు. వారు.. పోలీస్ సూపరింటెండెంట్ రాబిన్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శైలేష్ సింగ్, డిప్యూటీ జైలర్ రాజేశ్ కుమార్ రజక్. వీరిని లాలూ యాదవ్ అనే ఏజెంట్ తీసుకురాగా, వారిని రామ్‌వీర్ సింగ్, అజితా భట్టాచార్య బోర్డుతో ఇంటర్వ్యూ ఫిక్స్ చేశారని పేర్కొన్నారు. దీనిలో ఎగ్జామ్ కంట్రోలర్ శ్వేతా గుప్తా, పతంజలి కోచింగ్ సెంటర్ ఆపరేటర్ రవికుమార్ పాలుపంచుకున్నారని తెలిపారు.డబ్బులను వివిధ వ్యక్తుల చేరవేసేవారు. అజితా భట్టాచార్యకు పంపాల్సినవి ఆమె పీఏ బ్రిజ్‌రామ్‌కు ఇచ్చారు. ఖియాంగ్టేకు ఇవ్వాల్సినవి ధర్మేంద్ర అనే వ్యక్తి ద్వారా ఇచ్చేవారు అని పేర్కొన్నారు. అలాగే చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (అఆఖా) పరీక్షలో కూడా స్కామ్ చేశామని, ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 10 లక్షల చొప్పున వసూలు చేశామని వెల్లడించారు. కాజల్ భారతి అనే అభ్యర్థి నుంచి రూ. 10 లక్షలు తీసుకుని అజితా భట్టాచార్య బోర్డు ఇంటర్వ్యూను ఫిక్స్ చేశామని అభయ్ పోలీసులకు వివరించారు. పోలీసులు ఇప్పటికే జేపీఎస్‌సీ మాజీ చైర్మన్ ఖియాంగ్టేను అరెస్ట్ చేశారు. అజితా భట్టాచార్య, డాక్టర్ జమాల్ అహ్మద్, డాక్టర్ అమిమా హస్స్‌దా కమిషన్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. వీరికి సీఐడీ సమన్లు జారీ చేసి, మాజీ చైర్మన్‌కు సంబంధించిన అంశాలపై విచారించింది.

మీరు చేయలేకపోతే మేమే చేస్తాం.. లేబుల్స్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు హెచ్చరిక..

న్యూఢిల్లీ, అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈూూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారుఆహార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించిందిహెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.



ఉబర్, ఓలా వంటి యాప్స్‌లో ప్రీరైడ్ టిప్‌లకు కేంద్రం చెక్

ఉబర్, ఓలా వంటి రైడ్ హెయిలింగ్ యాప్స్‌లో ప్రయాణికులు ముందస్తుగా టిప్స్ చెల్లించాల్సిన అగత్యం తప్పింది. ఈ ఒరవడికి చెక్ పెడుతూ కేంద్రం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ప్రీ రైడ్ టిప్స్ ఆప్షన్‌ను తక్షణం తొలగించాలని రైడ్ హెయిలింగ్ యాప్స్‌కు కేంద్రం స్పష్టం చేసింది. ప్రీ రైడ్ టిప్స్‌తో త్వరగా వాహనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్న భావన కలిగించి ప్రయాణికుల నుంచి అదనపు డబ్బు తీసుకోరాదని కేంద్రం స్పష్టం చేసింది.మోటార్ వెహికిల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉన్న అడ్వాన్స్ టిప్, ఛూజ్ యూన్ యూడాన్, క్విక్‌ర్ రైడ్ కన్వఫర్మేషన్ వంటి ప్రీరైడ్ టిప్ ఆప్షన్స్‌ను తొలగించాలని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొంది. ప్రీరైడ్ టిప్ ఇస్తే డ్రైవర్ తమ అభ్యర్థనను త్వరగా ఆమోదిస్తారన్న భావన యూజర్లలో కలుగుతోందని పేర్కొంది.ఈ మార్గదర్శకాల ప్రకారం, ప్యాసింజర్లు స్వచ్ఛందంగా, అదీ ప్రయాణం ముగిసిన తరువాతే టిప్ చెల్లించాలి. త్వరగా క్యాబ్ బుకింగ్ జరుగుతుందన్న భావనతో టిప్స్ ముందస్తుగా చెల్లించే పరిస్థితి ఉండకూడదు. ఇక ప్యాసింజర్ టిప్ మొత్తం డ్రైవర్‌కే బదిలీ చేయాలి. ఓలా, ఉబర్ వంటి వాహన అగ్రిగేటర్‌లు ఇందులో ఎలాంటి వాటా స్వీకరించకూడదు.గతంలో సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ కూడా ఇదే తరహా ఆదేశాలు జారీ చేసింది.



'క్రీడా ప్రాంగణం కూల్చివేత ఆక్షేపనీయం'

స్థానికుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకోవాలి స్థల పరిశీలనలో బీఆర్ఎస్, సిపిఎం నేతలు



ఖమ్మం రూరల్, ఆగస్టు 13 : విద్యార్థులు, యువత భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం కూల్చివేయడం ఆక్షేపనీయమని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు నందిగామ కృష్ణ, ఎటుకూరి ప్రసాద్, స్థానిక ప్రజలతో కలిసి గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. ఇటీవల అధికారులు కూల్చి వేసిన క్రీడా మైదానంను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తొలుత స్థానికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో ఈ క్రీడా ప్రాంగణంలోని ఆటలాడుకోవడం జరుగుతుందన్నారు. పిల్లలకు ఉపయోగపడే క్రీడా ప్రాంగణాన్ని తిరిగి ఉపయోగాల్లోకి తీసుకురావాలని వారి కోరారు.బెల్లం వేణుగోపాల్ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్‌ను, యువకులలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకుగాను ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని కూల్చివేయడం సమంజసం కాదన్నారు. దీంతో ప్రభుత్వ నిధులు వృథా కావడంతో పాటు స్థానికులకు ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. స్థానికుల ఆలోచన మేరకు తిరిగి క్రీడా ప్రాంగణం పునఃనిర్మాణం చేయాలని, లేదా ఇప్పటికే శంకుస్థాపన చేసినటువంటి పార్కు ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలైన కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై త్వరలోనే అఖిలపక్ష నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ఇందిరమ్మ కాలనీ యువకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

నాందేడ్‌లో సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై కత్తులతో దాడి..



నాందేడ్, ఆగస్టు 13: శిరోమణి అకాలీదళ్ (ఖాంఆ) అధినేత, పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై మహారాష్ట్రలోని నాందేడ్‌లో దాడి జరిగింది. గురుద్వారాను సందర్శించి వస్తుండగా నగర శివార్లలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడి అనంతరం బాదల్‌ను నాందేడ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు.సుఖ్‌బీర్ సింగ్ బాదల్ తన భార్య, అకాలీదళ్ ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, కుటుంబ సభ్యులతో కలిసి నాందేడ్‌లోని ప్రసిద్ధ 'తఖ్త్ శ్రీ హజూర్ సాహిబ్' గురుద్వారాను సందర్శించారు. దర్శనం ముగించుకుని వస్తుండగా ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో బాదల్ తోపాటు, భద్రతా సిబ్బందిలో ఒకరికి గాయాలయ్యాయి. దాడి వెనుక ఉన్న కారణాలు, దాడి చేసిన వారి సమాచారంపై పోలీసులు ప్రాథమిక విచారణ జరుపుతున్నారు.

మావోయిస్టు క్యాంప్ నుంచి మోడలింగ్ ర్యాంప్ వరకు.. మారిన మాజీ మహిళా నక్సల్స్ జీవితాలు..

గతంలో ఆయుధాలు పట్టుకుని బస్తర్ అడవుల్లో నడిచిన ఆ మహిళలు ఇప్పుడు అదే ఆత్మవిశ్వాసంతో మోడలింగ్ ర్యాంప్‌పై నడిచారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరిగిన ఓకార్యక్రమంలో మాజీ మహిళా మావోయిస్టులు సందడి చేశారు. సాంప్రదాయ చేనేత వస్త్రాలను ధరించి ర్యాంప్ వాక్ చేశారు. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందిబస్తర్ ప్రాంతానికి చెందిన ఈ మహిళలు గతంలో మావోయిస్టు ఉద్యమంలో పనిచేశారు. అనంతరం లొంగిపోయి సాధారణ జనజీవనంలోకి తిరిగి వచ్చారు. ఇప్పుడు వారు తమకు లభించిన కొత్త అవకాశాలను ఉపయోగించుకుంటూ వివిధ రంగాల్లో ముందుకు సాగుతున్నారు. రాయ్‌పూర్‌లోని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆడిటోరియంలో నిర్వహించిన చేనేత కార్యక్రమంలో వారు కోసా పట్టు, చేతితో నేసిన సాంప్రదాయ ఛత్తీస్‌గఢ్ వస్త్రాలను ధరించి ర్యాంప్‌పై నడిచారు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు ర్యాంప్ వాక్ చేసిన మాజీ మహిళా మావోయిస్టులతో మాట్లాడి, వారి కొత్త ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వీరి ప్రయాణం ఇతర మావోయిస్టులకు కూడా సాధారణ జనజీవనంలోకి తిరిగి రావడానికి ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



విజయసాయిపార్టీ లీకుల వ్యూహం ఏమిటీ

నెల్లూరు, ఆగస్టు 13, వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు నంబర్-2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయసాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్‌సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చుఈ పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావరణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయసాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణ లేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మహాకుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు

రాజమండ్రి, ఆగస్టు 13, ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తరహాలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యున్నత వసతులతో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. దక్షిణాది మహా కుంభమేళాగా భావించే ఈ పుష్కరాలకు కోట్ల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తగినట్లు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మహాక్రతువు కోసం మొత్తం అంచనా వ్యయం రూ.8,500 కోట్లుగా నిర్ధారించగా.. తొలి విడత మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ పనుల నిమిత్తం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.530 కోట్లను అధికారికంగా మంజూరు చేసింది.పుష్కరాల నిర్వహణలో అత్యంత కీలకమైన శాఖలకు నిధుల కేటాయింపులను ప్రభుత్వం పక్కాగా వర్గీకరించింది. గోదావరి తీరంలో భక్తుల రద్దీని తట్టుకునేలా 238 పాత , కొత్త పుష్కర ఘాట్ల ఆధునీకరణ, మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్న నీటిపారుదల శాఖకు అత్యధికంగా రూ.210.06 కోట్లు కేటాయించారు. పట్టణ మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ పనుల నిమిత్తం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.150 కోట్లు విడుదల కాగా, గోదావరి తీరమంతటా నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో పాటు ఆలయాల సుందరీకరణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు దేవాదాయ శాఖకు రూ.60 కోట్లు, టూరిజం సేవలు, సాంస్కృతిక ప్రదర్శనల విస్తరణకు పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.10 కోట్ల నిధులు విడుదలయ్యాయి.ఈసారి పుష్కరాలలో డిజిటల్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లక్షలాది మంది భక్తులు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ సర్వైలెన్స్, రియల్ టైమ్ కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. భక్తులు తాము స్నానం చేయాలనుకునే ఘాట్లు, స్లాట్ బుకింగ్, ట్రాఫిక్ రూట్ మ్యాప్స్, అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య సేవల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను, క్యూఆర్ కోడ్ నేవిగేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.నది తీరం పొడవునా పారిశుధ్యం, భద్రత , పర్యావరణ పరిరక్షణ విషయాలలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. నది నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఫిల్టేషన్ గ్రిడ్లను ఏర్పాటు చేయడమే కాక, ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఘాట్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా మొబైల్ మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులు, పారిశుధ్య సిబ్బంది , స్విమ్మింగ్ నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు వేగంగా పనిచేస్తాయి. రాజమండ్రి, కోవూరు, నరసాపురం, భద్రాచలం పరిసర ప్రాంతాల గోదావరి తీరాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది, పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు భక్తిపారవశ్యంతో పాటు అధునాతనమైన, సురక్షితమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే లక్ష్యంగా వైభవంగా ఏర్పాట్లు వేగవంతమవుతున్నాయి.

ఏపీలో వడివడిగా మెట్రో అడుగులు



విజయవాడ, ఆగస్టు 13,దేశంలోని చాలా నగరాలల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో సేవలు కలిగిన రాష్ట్రాల జాబితాలోకి త్వరలో ఏపీ కూడా చేరబోతోంది. ఇతర రాష్ట్రాల్లో కేవలం ఒక ఒకటి, అరా నగరాల్లోనే మెట్రో సేవలు కొనసాగుతుంటే.. ఏపీలో ఏకంగా రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఏపీలోని విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ లకు కేంద్రం ఆమోద ముద్ర పడే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక మదింపును కేంద్రం ప్రారంభించింది. అంటే?ఈ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టేనని చెప్పవచ్చు. తెలుగు నేల విభజన తర్వాత విభజిత ఏపీలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ? 2015లోనే విజయవాడతో పాటుగా విశాఖలో మెట్రో సేవల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలపై నాడు ఓ మోస్తరు అడుగులు పడినా? 2019లో టీడీపీ ఓడిపోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రాజెక్టులు కాస్తా అటకెక్కేశాయి. అయితే 2024 ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసిన టీడీపీ? తిరిగి అధికారం చేజిక్కించుకుంది. అంతేకాకుండా అటు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు, ఇటు ఏపీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు కొలువు దీరడంతో? సీఎం నారా చంద్రబాబునాయుడు మరోమారు మెట్రో ప్రాజుక్టుల బూజు దులిపారు.విజయవాడ, విశాఖల మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్ లను రూపొందించిన కూటమి సర్కారు.. వాటిని కేంద్రం పరిశీలనకు పంపింది. ఈ ప్రతిపాదనలపై దృష్టి సారించిన కేంద్రం? ఇటీవలే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక మదింపును ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే? ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోద ముద్ర పడనుంది. ఆ వెంటనే విజయవాడ, విశాఖల్లో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ కూడా ప్రారంభం కానుంది. వెరసి అతి త్వరలోనే ఈ రెండు నగరాల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయన్న మాట. రెండు నగరాల్లో మొత్తంగా 84.63 కిలో మీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి.ఇక విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు విషయానికి వస్తే..పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరు దారా తొలి దశ మెట్రో రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బందరు రోడ్డు, ఏలూ రోడ్డు, గన్నవరం, పెనమలూరుల్లో భూసేకరణకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. నగరంలో 38.40 కిలో మీటర్ల మేర ఏర్పాటు కానున్న మెట్రో ప్రాజెక్టుకు రూ.10,118 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరుల వరకు రెండు మార్గాల్లో మెట్రో ఏర్పాటు కానుంది. విశాఖ మెట్రో విషయానికి వస్తే? నగరంలో మూడు మార్గాల్లో 46.22 కిలో మీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. డబుల్ డెక్కర్ మోడ్ లో ఈ వ్యవస్థ ఏర్పాటు కానుంది. మూడు మార్గాల్లో కలిపి 43 మెట్రో స్టేషన్లు ఉంటాయి. ఇందుకోసం రూ.11,498 కోట్ల నిధులు అవసరం కానున్నట్లుగా డీపీఆర్ లో పేర్కొన్నారు. ఇక ఈ మెట్రో స్టీల్ ప్లాంట్, గాజువాక, ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతువాకల్లో ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానుండగా? కొమ్మాది వరకూ మెట్రో ఏర్పాటు కానుంది. రెండు ప్రాజెక్టులకు కలిపి మొత్తంగా రూ.21,616 కోట్ల మేర నిధులు అవసరం కానున్నాయి. ఈ నిధుల్లో రాష్ట్రం వాటా 20 శాతం కాగా?కేంద్రం కూడా తన వంతుగా మరో 20 శాతం నిధులను అందించనుంది. ఇక మిగిలిన 60 శాతం నిధులను ఆయా ఆర్థిక సంస్థల నుంచి రుణం రూపేణా సేకరించే దిశగా డీపీఆర్ రెడీ అయ్యింది. ఏపీలో కొనసాగుతున్న పారిశ్రామిక ప్రగతి, అమరావతి అభివృద్ధిలను పరిశీలిస్తున్న పలు ప్రైవేట్ అంతర్జాతీయ సంస్థలు మెట్రో ప్రాజెక్టులో నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వెరసి త్వరలోనే ఏపీలో రెండు ప్రాజెక్టులు ఒకేసారి పట్టాలెక్కనున్నాయని చెప్పవచ్చు.

సీడ్ యాక్సెస్ రహదారిపై దుష్ప్రచారం

అపోహలకు ఎలాంటి తావు లేదన్న పురపాలక శాఖ

అమరావతి,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): ఏపీ రాజధాని అమరావతి సీడ్ యాక్సెస్ రహదారిలోని ఎస్ ఆకారపు మలుపుపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తెలిపింది. అమరావతిని ఇతర ప్రాంతాలతో కనెక్ట్ చేసే ప్రధాన సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణంపై అపోహలకు తావులేదని స్పష్టం చేసింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం ఉంటుందని పేర్కొంది. ఈ రహదారి మూడో దశలో విజయవాడ- చెన్నై నేషనల్ హైవే కనెక్టివిటీకి అనుగుణంగా ఈ నిర్మాణం ఉంటుందని చెప్పింది. సీడ్ యాక్సెస్ రహదారిని మణిపాల్ హాస్పిటల్ దగ్గర జాతీయ రహదారితో అనుసంధానం చేసేలా ప్రణాళికలు చేస్తున్నట్లు పురపాలక శాఖ వెల్లడించింది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు అనువుగా ప్రస్తుత సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం ఉంటుందని తెలిపింది. 2017 ప్రణాళిక ప్రకారమే దొండపాడు నుంచి తాడేపల్లి వరకూ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొంది. రాజధాని అమరావతికి, మంగళగిరి, విజయవాడలతో కనెక్టివిటీ పెంచేలా స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రహదారులు అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. సీడ్ యాక్సెస్ రహదారి కనెక్టివిటీ అందుబాటులోకి రావటంతో కృష్ణా కరకట్టపై వాహనాల రద్దీ తగ్గనుందని పేర్కొంది. ఈ వాస్తవాలను గమనించి అపోహలకు గురి కావొద్దని ప్రజలకు పురపాలక శాఖ విజ్ఞప్తి చేసింది.

గూడూరులో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ.

ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలి

దేశభక్తి స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలని అధికారుల పిలుపు

గూడూరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా, "వందే మాతరం" 150 సంవత్సరాల సందర్భంగా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని గూడూరు మండలం, గూడూరు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, పాఠశాల విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండా ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు."హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై, ప్రతి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు అవగాహన కల్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ పతాకం పట్ల గౌరవభావాన్ని పెంపొందించుకోవాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యాలయ సిబ్బంది, అధికారులు కూడా ర్యాలీలో పాల్గొని ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా "వందే మాతరం", "జై హింద్" వంటి నినాదాలతో గూడూరు పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్ కుమార్, తహసీల్దార్ వెంకటేష్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ (గూడూరు ఎస్‌పీఎల్ ఆఫీసర్), గూడూరు మున్సిపల్ కమిషనర్, ఎంఆర్ఐ సందీప్ నాయక్ తదితర అధికారులు, పాఠశాల విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ దేశభక్తి స్ఫూర్తితో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబం తమ ఇంటిపై, ప్రతి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతీయ సమైక్యత, దేశభక్తిని చాటాలని కోరారు.దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను నేటి తరం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని, జాతీయ పతాకం మన దేశ గౌరవానికి ప్రతీక అని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములై "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కూటమి సర్కార్‌కు 'కౌన్సిల్' గండం..!

విజయవాడ, ఆగస్టు 13, తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైసీపీ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రాబోయే ఏపీ శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలపై పార్టీ శ్రేణులకు జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలో ఏపీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ అభ్యర్థిగా గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును వైఎస్ జగన్ అధికారికంగా ఎంపిక చేశారు.అయితే, గత సమావేశాల మాదిరిగానే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని వైసీపీ ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. కానీ, తమకు పూర్తి మెజారిటీ ఉన్న శాసనమండలి (కౌన్సిల్) సమావేశాలకు మాత్రం వైసీపీ ఎమ్మెల్సీలు అందరూ విధిగా హాజరుకావాలని పార్టీ అధిష్టానం స్పష్టం చేసింది. అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ, శాసనమండలి వేదికగా అధికార చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వైసీపీ పక్కా వ్యూహాలు రచిస్తోంది.పోయినసారి తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ వ్యవహారంపై పెద్ద ఎత్తున రచ్చ చేసిన వైసీపీ, ఈసారి నిరుద్యోగుల సమస్యలను ప్రధాన అస్త్రంగా మార్చుకోనుంది. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో జరిగినట్లు చెప్తున్న అవకతవకలు, మరియు అభ్యర్థుల ఆందోళనలను మండలిలో బలంగా వినిపించాలని వైసీపీ భావిస్తోంది. మెగా డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా నిరుద్యోగుల పక్షాన నిలబడాలని వైఎస్ జగన్ తన ఎమ్మెల్సీలకు సూచించారు.ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో సులభంగా బిల్లులను ఆమోదింపజేసుకున్నప్పటికీ, శాసనమండలిలో మాత్రం వైసీపీకి మెజారిటీ ఉండటంతో ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను అడ్డుకునే అవకాశం ఉంది. ఒకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై సిట్ తుది నివేదికతో కూటమి సర్కార్ వైఎస్సార్సీపీని కట్టడి చేయాలని చూస్తుండగా, మరోవైపు కల్తీ లడ్డు, డీఎస్సీ వ్యవహారాలను అడ్డం పెట్టుకుని శాసనమండలి వేదికగా ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టేందుకు వైసీపీ సిద్ధమవుతోంది. దీంతో ఈ వర్షాకాల సమావేశాలలో మండలి వేదికగా ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలోనే రాజకీయం నడవనుందని స్పష్టమవుతోంది.

మిత్రపక్షాల మధ్య డిజిటల్ వార్

విజయవాడ, ఆగస్టు 13, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి తమ సోషల్ మీడియా శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. కొద్దిరోజులుగా సోషల్ మీడియా వేదికగా టీడీపీ, జనసేన సైనికుల మధ్య సాగుతున్న పరస్పర విమర్శలు, వ్యక్తిగత దూషణలు శృతిమించి కూటమి ఐక్యతకే సవాలుగా మారిన తరుణంలో నాయకత్వం ఈ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. గొడ్డలి పార్టీ కుట్రపూరితంగా సృష్టించిన నకిలీ ఖాతాల వల్ల ఈ అంతర్గత కలహాలు నడుస్తున్నాయని, ఆ ట్రాప్‌లో పడ వద్దని కూటమి సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ స్పష్టమైన ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని వారాలుగా సోషల్ మీడియాను గమనిస్తే.. పశ్చిమ ఏపీలోని అధికార సమన్వయం నుంచి మొదలుకొని, సినిమాలు, ఐకాన్స్, రాజకీయ ప్రాధాన్యతల వరకు టీడీపీ-జనసేన క్యాడర్ మధ్య ఘాటైన సైబర్ యుద్ధమే సాగుతోంది. సినిమాల నుంచి సీనియర్ ఎన్టీఆర్ ఆహారపు అలవాట్ల వరకూ తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేసుకోవడం నిత్యకృత్యమైంది. గ్రౌండ్ లెవల్‌లో నాయకుల మధ్య సఖ్యత ఉన్నప్పటికీ, సోషల్ మీడియా డిజిటల్ స్పేస్‌లో చోటుచేసుకుంటున్న ఈ తీవ్ర స్వభావపు విమర్శలు అసలైన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రత్యర్థులకు బలమైన రాజకీయ ఆయుధాన్ని అందించాయి.ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని విపక్ష వైసీపీ సైబర్ వింగ్ అత్యంత వ్యూహాత్మకంగా సూడో అకౌంట్స్ నడుపుతోందని కూటమి సంయుక్త ప్రకటన ఎండగట్టింది. ఒక టీడీపీ అభిమానిలా ప్రొఫైల్ రూపొందించి పవన్ కల్యాణ్‌ను హేళన చేయడం, అలాగే జనసేన సైనికుడి ముసుగులో చంద్రబాబు లేదా లోకేష్‌లను వ్యక్తిగతంగా విమర్శించడం ద్వారా ఇరు వర్గాల అసలైన కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైనాన్ని కమిటీ గుర్తించింది. ఈ డిజిటల్ ట్రాప్ వల్ల నిజమైన సైనికులు ఆవేశానికి లోనై ఒకరినొకరు కించపరుచుకుంటూ, చివరికి తమ సొంత ప్రభుత్వ విజయావకాశాలను, పథకాల ప్రచారాన్ని పక్కనబెట్టి అంతర్గత పోరులోనే శక్తిని వృధా చేసుకుంటున్నారు.రాజకీయాల్లో క్షేత్రస్థాయి ఐక్యత ఎంత ముఖ్యమో, డిజిటల్ మైండ్ స్పేస్‌లో పొత్తు ధర్మాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే కీలకం. శ్రేణుల మధ్య స్వల్ప విభేదాలు కాస్తా పార్టీల అగ్రనేతల మధ్య వైరి వర్గాలుగా రూపాంతరం చెందే ప్రమాదం ఉందని గ్రహించినందునే ఈ ఉమ్మడి ప్రకటన వెలువడింది. సంయమనం పాటించకపోతే, మిత్రపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకుని విద్వేషం చిమ్మే ఏ అకౌంట్‌పైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేయడం మంచి పరిణామం అనుకోవచ్చు. ఆవేశాన్ని పక్కనబెట్టి, ప్రత్యర్థుల నకిలీ వ్యూహాలను తిప్పికొడుతూ ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపైనే కూటమి సోషల్ సైన్యాలు దృష్టి సారించాల్సి ఉంది.

రెండు కుంటల భూమి ఇస్తే ఓకే లేకపోతె అంతు చూస్తానని బెదిరింపులు

చంద్రుగొండ, ఏజెన్సీ చట్టాలను అడ్డుపెట్టుకొని మండలంలో అధికారులను బెదించటం పరిపాటిగ మారిందనే విమర్సలున్నాయి. ఇటీవల సమాచారం చట్టం ప్రకారం రెవెన్యూ భూముల వివరాలను తెలుసుకున్న ఓ సామాజిక వర్గం నాయకుడు చంద్రుగొండ సబ్ రిజిస్టర్లు ను గత కొంతకాలంగా అనధికారికంగా తనకు రెండు కుంటల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూన్నాడని తెలుస్తోంది. రెవెన్యూ అధికారుల నుండి ఎలాంటి హామి రాకపోవడంతో మద్యం సేవించిన సదరు ఆ నాయకుడు ఈనెల 11 న సబ్జస్టార్ కార్యాలయంలోకి చొరబడి సబజిస్టార్?ను నేరుగా బెదిరించాడనే ఆరోపణలు వస్తున్నాయి. గంటన్నర పాటు రెవెన్యూ కార్యాలయంలో దర్జాగా కూర్చొని బెదిస్తుండటంతో విసుగు చెందిన సబ్ రిజిస్టార్ చంద్రుగొండ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వటం, అక్కడకు పోలీసులు వచ్చిన ఎటువంటి చర్యలు తీసుకోకపోగా నిమ్మకునీరెత్తన్నట్లువ్యవరించి, రాచమర్యాదలతో పోలీసులు సదరు ఆ వ్యక్తి ని అక్కడ నుండి పంపించడం గమనార్హం. తనను బెదిరించి, కార్యాలయ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని కనీసం పోలీసులు అదుపులోకి తీసుకొలేదని సబరిజిస్టార్ ఉన్నతాధికారులకు, తోటి తహసీల్దార్ల వద్ద వాపాయిన్నట్లు విశ్వసనీయ సమాచారం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి దౌర్జన్యంగా ప్రవేశించటమే కాకుండా మద్యం మత్తులో విధులకు ఆటంకం కలిగించిన అతనిపై పోలీసు, రెవెన్యూశాఖలు చర్యలు తీసుకోకపోవడం పట్ల మండల ప్రజలు విస్మయం చెందుతున్నారు.

స్పోర్ట్స్ స్కాన్

ఆ వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెనే సీఎస్‌కే హెడ్ కోచ్: అశ్విన్

ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్.. చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. వచ్చే వారం ఇయాన్ మోర్గాన్ నియామకంపై అధికారిక ప్రకటన వెలువడనుందని అశ్విన్ తెలిపాడు.18 ఏళ్ల పాటు చెన్నై సూపర్ కింగ్స్‌కు హెడ్ కోచ్‌గా సేవలు అందించిన స్టీఫెన్ ఫ్లేమింగ్ ఇటీవలే తన బాధ్యతల నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. సీఎస్‌కే నుంచి వైదొలిగిన ఫ్లెమింగ్ ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. దాంతో సీఎస్‌కే తదుపరి హెడ్ కోచ్ ఎవరా? అనేది తీవ్ర చర్చనీయాంశమైంది. మహేంద్ర సింగ్ ధోనీ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నట్లు కూడా ప్రచారం జరిగింది.ఈ వ్యవహారంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. ఆశ్చర్యకరంగా ఇయాన్ మోర్గాన్ పేరును ప్రస్తావించాడు. 'నాకు తెలిసిన వర్గాల సమాచారం ప్రకారం సీఎస్‌కే హెడ్ కోచ్ పదవికి ఇయాన్ మోర్గాన్ పేరు వినిపిస్తోంది. వచ్చే వారంలో మోర్గాన్ నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఈ నిర్ణయాన్ని మహేంద్ర సింగ్ ధోనీకి వదిలేసినట్లు నాకు అనిపిస్తుంది. అయితే ఇయాన్ మోర్గాన్ నియమాకం సరైందే. ఎందుకంటే మెగా ఆక్షన్‌కు ఇంకా ఏడాది మాత్రమే సమయం ఉంది. ఫ్లెమింగ్ స్థానంలో మరొకరిని ఎంచుకోవడం ఇప్పటికే ఆలస్యమైంది.ఇయాన్ మోర్గాన్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపడితే.. నాథన్ లేమన్ సపోర్ట్ స్టాఫ్‌లో చేరనున్నాడు. ఇంగ్లండ్ కెప్టెన్‌గా మోర్గాన్ ఉన్న సమయంలో నాథన్ లేమన్ డేటా అనలిస్ట్‌గా పని చేశారు. ఇయాన్ మోర్గాన్ కేకేఆర్ కెప్టెన్‌గా ఉన్న సమయంలోనూ అతను ఆ జట్టులో చేరాడు.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.అయితే ఇయాన్ మోర్గాన్‌కు హెడ్ కోచ్‌గా పనిచేసిన అనుభవం లేదు. కానీ వైట్ బాల్ క్రికెట్‌లో అతనికి అపారమైన అనుభవం ఉంది. 2019 వన్డే ప్రపంచకప్ అందించి ఇంగ్లండ్ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చాడు. ఐపీఎల్‌లో తన సారథ్యంలో కేకేఆర్‌ను ఫైనల్‌కు చేర్చాడు.



ఆర్‌సీబీ బ్యాటర్‌పై కన్నేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్!

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) ఊరించి ఊసురుమనిపించింది. అసాధారణ ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ చేరిన ఆరెంజ్ ఆర్మీ.. కీలక ఎలిమినేటర్‌లో చేతులెత్తేసి ఇంటిబాట పట్టింది. టైటిల్ అందుకోకపోయినా.. అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా కుర్రాళ్ల ప్రదర్శన జట్టు భవిష్యత్తుపై ఆశలను రేకెత్తించింది.తృటిలో టైటిల్ అందుకునే అవకాశం కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీ.. వచ్చే ఏడాది మరింత బలంగా తిరిగి రావాలనే పట్టుదలతో ఉంది. తదుపరి సీజన్ కోసం జట్టును బలోపేతం చేయడంపై కావ్యమారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే జట్టు బలహీనతలను అధిగమించేందుకు కోనుగోలు చేయాల్సిన ఆటగాళ్లపై దృష్టి పెట్టింది.ముఖ్యంగా లోయార్డర్‌లో ఫినిషర్‌గా సత్తా చాటే ఇండియన్ బ్యాటర్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ అన్వేషిస్తోంది. ఈ క్రమంలోనే ఆర్‌సీబీతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ట్రేడ్ డీల్‌కు ప్రయత్నించినట్లు వార్తలు వచ్చాయి. ఆర్‌సీబీ ఫినిషర్ జితేష్ శర్మను ఆరెంజ్ ఆర్మీ అడిగినట్లు ప్రచారం జరుగుతోంది.అయితే జితేష్ శర్మ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇషాన్ కిషన్‌ను వదులుకోలేదు. జట్టు భవిష్యత్ సారథిగా ఇషాన్ కిషన్ ఎదుగుతున్నాడు. ప్యాట్ కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టును నడిపించాడు. ఐపీఎల్ 2027 సీజన్‌లో ప్యాట్ కమిన్స్ ఆడటంపై సందేహాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇషాన్ కిషన్‌ను వదులుకునే సాహసం ఆరెంజ్ ఆర్మీ చేయకపోవచ్చు.ఐపీఎల్ 2026 సీజన్‌లో ఇషాన్ కిషన్ అద్వితీయమైన ప్రదర్శన కనబర్చాడు. 15 మ్యాచ్‌ల్లో 40.13 సగటుతో 602 పరుగులు చేశాడు. మరోవైపు జితేష్ శర్మ దారుణంగా విఫలమయ్యాడు. 12 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసిన అతను 12.89 సగటుతో 116 పరుగులే చేశాడు. ఫామ్‌లో లేని బ్యాటర్ కోసం ప్రధాన ఆటగాడిని వదులుకుంటారా? అని ఆరెంజ్ ఆర్మీ అభిమానులు ప్రశ్నిస్తున్నారు.



టెస్ట్ సిరీస్.. జియో హాట్‌స్టార్‌లో రాదు! ఫ్రీగా ఎలా చూడాలంటే..?

శ్రీలంక పర్యటనలో టీమిండియా తొలి పోరుకు సిద్ధమైంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం(ఆగస్ట్ 15) నుంచి గాలే వేదికగా ప్రారంభం కానున్న తొలి మ్యాచ్‌లో అతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్ టీమిండియాకు అత్యంత కీలకం.డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను భారత్ 2-0తో క్లీన్ స్వీప్ చేయాలి. అయితే గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. ఈ క్రమంలోనే శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జట్టు నిండా కుర్రాళ్లే ఉండటంతో భారత్ ఏ మేరకు రాణిస్తుందో అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.శ్రీలంక ఎలెవన్‌తో మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో విజయం సాధించడం భారత్ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ముఖ్యంగా టెయిలెండర్ మహమ్మద్ సిరాజ్ ఆఖరి ఓవర్‌లో వరుసగా మూడు సిక్స్‌లు బాది విజయాన్ని అందించడం ఆటగాళ్లకు మరింత ఆనందాన్నిచ్చింది. అదే జోరులో తొలి టెస్ట్‌లో విజయం సాధించి 1-0తో ఆధిక్యంలో నిలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. శ్రీలంకలో పిచ్‌లు సాధారణంగా స్పిన్‌కు అనుకూలంగా ఉంటాయి. ఈ క్రమంలోనే టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉంది.అయితే ఈ సిరీస్‌కు సోనీ నెట్‌వర్క్ అధికారిక బ్రాడ్‌కాస్టర్‌గా వ్యవహరిస్తోంది. దాంతో జియో హాట్‌స్టార్, స్టార్ స్పోర్ట్స్‌లో ఈ మ్యాచ్‌లు రావు. శ్రీలంక సిరీస్‌ను ప్రత్యక్షంగా వీక్షించాలంటే సోనీ టీవీ ఛానెల్స్‌తో పాటు సోనీ లివ్ యాప్‌ను సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సిందే. ఈ వేదికల్లో ఫ్రీగా చూసే అవకాశం లేదు.





వ్యక్తి పూజను పక్కన పెట్టండి.. శ్రీలంకను ఓడించడం అంత ఈజీ కాదు: గవాస్కర్



శ్రీలంక గడ్డపై టెస్ట్ సిరీస్ గెలవడం అంత ఈజీ కాదని టీమిండియాను దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ హెచ్చరించాడు. జట్టులోని ప్రతీ ఒక్కరు వ్యక్తిగత మైలురాళ్ల కంటే జట్టుకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే.ఆగస్ట్ 15 నుంచి ఈ సిరీస్ మొదలవ్వనుంది. గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను టీమిండియా క్లీన్ స్వీప్ చేయాలి. ఇప్పటి వరకు ఈ సైకిల్‌లో 9 టెస్ట్‌ల్లో 4 గెలిచి మరో 4 ఓడిన భారత్ ఒక మ్యాచ్ డ్రా చేసుకుంది. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఫైనల్ బెర్త్ ఖరారు కావాలంటే మిగతా 9 మ్యాచ్‌ల్లో కనీసం ఏడింటిలో గెలుపొందాలి. ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోవద్దు.ఈ నేపథ్యంలో టీమిండియాకు సునీల్ గవాస్కర్ కీలక సూచనలు చేశాడు. శ్రీలంకను ఏ మాత్రం తక్కువ అంచనా వేయవద్దని హెచ్చరించాడు. 'శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్ గెలవడం అంత ఈజీ కాదు. సొంత గడ్డపై శ్రీలంకను ఓడించడం చాలా కష్టం. అయితే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరాలంటే భారత్ ఈ సిరీస్ గెలవడం అత్యంత కీలకం.అలాగే క్లీన్ స్వీప్ చేసి కొత్త టెస్ట్ సీజన్‌ను ఘనంగా ప్రారంభించాలి. అలా చేయాలంటే కఠినమైన శ్రమతో పాటు కొంత అదృష్టం కలిసిరావాలి. అన్నింటికంటే ముఖ్యంగా ఎంతటి గొప్ప స్టార్ అయినా సరే.. వ్యక్తిగతం కంటే జట్టుకే ప్రాధాన్యత ఇవ్వాలి.'అని గవాస్కర్ సూచించాడు.శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా 2-0తో క్లీన్ స్వీప్ చేసినా పాయింట్స్ టేబుల్‌లో భారత్ స్థానం ఏమాత్రం మెరుగవ్వదు. అదే 0-2తో సిరీస్ కోల్పోతే మాత్రం పాతాళానికి పడిపోతుంది. శ్రీలంక నాలుగో స్థానానికి ఎగబాకుతుంది. 1-0తో ఓడినా భారత్ స్థానం దిగజారుతోంది. 1-0తో గెలిస్తే విన్నింగ్ పర్సంటేజ్ మెరుగైనా.. ఐదో స్థానంలోనే కొనసాగుతోంది.

23 ఏళ్ల తర్వాత తొలి టెస్ట్.. ఆస్ట్రేలియాను గడగడలాడించిన బంగ్లాదేశ్!



ఆస్ట్రేలియా పర్యటనను బంగ్లాదేశ్ ఘనంగా ప్రారంభించింది. 23 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై తొలి టెస్ట్ ఆడుతున్న బంగ్లాదేశ్.. ఫస్ట్ టెస్ట్ తొలి రోజు అతిథ్య జట్టును గడగడలాడించింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్‌లో టాస్ గెలిచిన బ్యాటింగ్ దిగిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది.ంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హోస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించి ఇజ్జత్ కాపాడాడు. ట్రావిస్ హెడ్(22), జాక్ వెదరాల్డ్(23), మార్నస్ లబుషేన్(1), కామెరూన్ గ్రీన్(13), అలెక్స్ క్యారీ(19), బ్యూ వెబ్‌స్టర్(12), పాట్ కమిన్స్(9), మిచెల్ స్టార్క్(1), నాథన్ లయన్(7) తీవ్రంగా నిరాశపర్చారు. ఓవైపు వరుసగా వికెట్లు పడినా స్టీవ్ స్మిత్ ఒంటరి పోరాటం చేశాడు.టెస్ట్‌ల్లో బంగ్లాదేశ్‌పై ఆసీస్‌కు ఇదే అత్యల్プ స్కోర్. ఈ మ్యాచ్‌లో పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగిన ఆసీస్..ఆశించిన రీతిలో రాణించలేకపోయింది. ఇప్పటి వరకు బంగ్లాదేశ్‌తో ఆసీస్ 7 టెస్ట్‌లు ఆడగా.. ఇదే అత్యల్プ స్కోర్. 9 ఏళ్ల క్రితం 2017లో మిర్‌పూర్‌లో బంగ్లాదేశ్‌పై ఆసీస్ ఓడిన టెస్ట్‌లో 217 పరుగులకే ఆలౌటైంది. ఇప్పటి వరకు ఇదే అత్యల్పం కాగా.. తాజా ఇన్నింగ్స్ దాన్ని బ్రేక్ చేసింది.అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు. ఓపెనర్ షాదమన్ ఇస్లామ్(20)ను మిచెల్ స్టార్క్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ప్రస్తుతం బంగ్లాదేశ్ 102 పరుగుల వెనుకంజలో ఉంది. మొత్తంగా తొలి రోజు ఆటలో మూడు సెషన్లలో బంగ్లాదేశ్ ఆధిపత్యం చెలాయించింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో చాలా మంది ఎడ్జ్‌లతో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగారు.

వైభవ్ వరల్డ్ క్లాస్ ప్లేయర్ అవుతాడు: ఆసీస్ దిగ్గజం

ఇండియా చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీపై ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హెడెన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ 15 ఏళ్ల పిల్లాడి ఆటకు తాను ఫిదా అయ్యానని.. అతడు పొట్టి ఫార్మాట్‌కు మాత్రమే పరిమితం కాకూడదని పేర్కొన్నారు. ప్రస్తుతం వైభవ్ దులిప్ ట్రోఫికి సిద్ధమవుతున్నాడు. ఈస్ట్ జోన్‌కి అతడు వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో విమర్శలు రాగా.. హెడెన్ తాజాగా స్పందించారు. "కొంత మంది వైభవ్ కేవలం పొట్టి ఫార్మాట్ ప్లేయర్ మాత్రమే అని అంటున్నారు. నేను ఆ విషయాన్ని అంగీకరించను. సంప్రదాయ ఫార్మాట్‌లోనూ అదరగొట్టగల సత్తా అతడికి ఉంది. అయితే అందుకు ఫిట్‌గా ఉండటం ముఖ్యం. అంతకు ముందు మానసికంగా దృఢంగా మారాలి. ఏదేమైనా 15 ఏళ్ల వయసులోనే అతడు ఆట తీరుతో తనని తాను నిరూపించుకున్నాడు. ఐపిఎల్ వంటి టోర్నమెంట్‌లో పాల్గొని.. అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అతడు కచ్చితంగా వరల్డ్ క్లాస్ ప్లేయర్‌గా ఎదుగుతాడు. అయితే వైభవ్ తన ఆట తీరును మరింత మెరుగు పర్చుకోవాల్సి ఉంటుంది. అతడికి అద్భుతమైన నైపుణ్యాలు ఉన్నాయి. వాటిని ఎలా ఉపయోగిస్తాడనే ముఖ్యం" అని హెడెన్ పేర్కొన్నారు.



వాత్సల్య ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి
కూతురు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు





ఖమ్మం, ఆగస్టు 13 : తన 16 ఏళ్ల కుమార్తె చల్లా హేమశ్రీ మృతికి కారణమైన వాత్సల్య ఆసుపత్రి సిబ్బంది, సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొనిజర్ల మండలం బస్వాపురం గ్రామానికి చెందిన చల్లా రమేష్ ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిని సీజ్ చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఈ నెల 9న తన కుమార్తె హేమశ్రీ అనారోగ్యానికి గురికావడంతో స్థానికంగా ఆర్ఎంపీగా పనిచేస్తున్న మారుతి సంపత్ వద్దకు తీసుకెళ్లినట్లు రమేష్ తెలిపారు. అనంతరం ఆమెను ఖమ్మంలోని వాత్సల్య ఆసుపత్రికి తరలించారని, అక్కడ చికిత్స అందించిన కొద్దిసేపటికే బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందినట్లు తమకు తెలిపారని పేర్కొన్నారు.

తన కుమార్తె మృతిపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి ఆసుపత్రికి వెళ్లిన సమయంలో కొందరు తమను బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారని రమేష్ ఆరోపించారు. ఆసుపత్రి యాజమాన్యం, సంబంధిత వైద్యుల వ్యవహారంపై తమకు అనుమానాలు ఉన్నాయని, మృతికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని కోరినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంతేకాకుండా తమపై దాడికి పాల్పడి, దుర్భాషలాడుతూ బెదిరింపులకు గురిచేశారని, తన కుమార్తె మృతదేహాన్ని బలవంతంగా తీసుకెళ్లే పరిస్థితి ఏర్పడిందని రమేష్ ఆరోపించారు. ఆసుపత్రి యాజమాన్యం తరఫున కొందరు తమకు నష్టపరిహారం అందించే ప్రయత్నం చేసినప్పటికీ, మరికొందరు వ్యక్తులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారని తెలిపారు.

ఆసుపత్రిపై విచారణ జరిపించాలి

వాత్సల్య ఆసుపత్రిలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, వైద్యపరమైన నిర్లక్ష్యం ఏమైనా జరిగిందా అనే విషయాన్ని తేల్చాలని రమేష్ కోరారు. బాధ్యులుగా తేలిన వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రభుత్వ వైద్యాధికారులతో విచారణ జరిపించి, ఆసుపత్రి నిర్వహణ, వైద్యుల అర్హతలు, చికిత్సా విధానం తదితర అంశాలను పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తన కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతానని రమేష్ తెలిపారు.

లయన్స్ క్లబ్ ద్వారా డ్రమ్ సెట్ వితరణ
నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో



నాగర్ కర్నూల్ (తెలంగాణ పవర్) ఆగస్టు : 13: దేశి ఇటిక్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ గవర్నర్ రాధాకృష్ణ చేతుల మీదుగా డ్రమ్ సెట్ అంద జేశారు.

ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ గతం లో నిర్వహించిన నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయిని డ్రమ్ సెట్ కావాలని కోరిందని, ఆ మేరకు డ్రమ్ సెట్ అంద జేశామని తెలిపారు.

అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నదని, వి ఉపయోగించుకొని విద్యార్థులు మంచి భవిష్యత్ కు పునాది వేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి, కోశాధికారి ప్రేమ్ కుమార్ రెడ్డి, కాబినెట్ సభ్యులు దొడ్ల రాజవర్ధన్ రెడ్డి, తెప్ప శ్రీను, మాజీ అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి ప్రధానోపాధ్యాయిని మంజుల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియ జేసారు.

పట్టణబీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



వేములవాడ, ఆగస్ట్ 13: వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ నేతృత్వంలో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. తిప్పాపురం హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకు సాగింది. నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలతో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. అనంతరం ప్రతాప రామకృష్ణతో కలిసి పలువురు పాఠశాల విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా లభించిన స్వాతంత్ర్యాన్ని స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లింగంపల్లి శంకర్ హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్, కౌన్సిలర్లు మైలారం శ్రీనివాస్, ముత్యం వంగల శ్రీనివాస్, నాయకులు రేగుల శ్రీకాంత్, మామిండ్ల లక్ష్మీరాజ్యం, పిన్నింటి హనుమాన్లు, గుడిసె మనోజ్, వాసం మల్లేశం, బిల్లా కృష్ణ, హరి, వివేక్‌రెడ్డి, కటకం శ్రీనివాస్, జవ్వాజి శేఖర్, నేరెళ్ల సాయి, కిరణ్, జగన్నాథం శ్రీనివాస్, పొలస రాజేందర్, హరీష్, సాయి కిరణ్, లాలా శేఖర్, పల్లెప లక్ష్మణ్, న్యాత మహేష్, శివ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో
భాగంగా ఇంటిపై త్రివర్ణ పతాకం



మెట్‌పల్లి, ఆగస్టు 13 (తెలంగాణ పవర్):హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా మెట్‌పల్లి పట్టణంలోని రేగుంట 13వ వార్డులో దేశభక్తిని చాటే కార్యక్రమం నిర్వహించారు. 192వ బూత్ అధ్యక్షులు, వార్డు ఇన్‌చార్జ్, సీనియర్ నాయకులు కలాలి రాజారెడ్డి తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగస్వాములై తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం దేశ ఐక్యతకు, గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో "భారత్ మాతాకీ జై", "జై శ్రీరామ్", "జై హింద్" అంటూ నినాదాలు చేశారు. దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటేలా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ ఇల్లు పేద కుటుంబానికి సొంతింటి కల.
ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 13 తెలంగాణ పవర్ : పినపాక నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి నూతన కేటాయింపులపై ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హౌసింగ్ శాఖ అధికారులను పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, సమస్యల పరిష్కారం, నిధుల విడుదల వంటి అంశాలపై సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు.మొదటి విడతలో పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాలకు మంజూరైన 4,500 ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటివరకు ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయో మండలాల వారీగా వివరాలు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే బేస్‌మెంట్, రూఫ్ లెవల్, పూర్తిస్థాయి నిర్మాణ దశకు చేరుకున్న ఇళ్ల సంఖ్యను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై కూడా ఆయన ఆరా తీశారు. నియోజకవర్గానికి మంజూరైన మొత్తం ఇళ్ల సంఖ్యతో పాటు ప్రతి మండలానికి కేటాయించిన వివరాలను సమర్పించాలని చెప్పారు. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఇప్పటివరకు గుర్తించిన కుటుంబాల సమగ్ర నివేదిక వెల్లడించాలని ఆదేశించారు.

అర్హత కలిగిన ఒక్క పేద కుటుంబం కూడా మిగిలిపోకుండా క్షేత్రస్థాయి సర్వే పూర్తిగా జరిగిందా లేదా అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే స్థలం, పట్టా, భూ సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల వివరాలు మండలాల వారీగా ఇవ్వాలని, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించాలని ఆయన కోరారు.

ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల సమస్యలు ఏమిటి, వారికి సహాయం అందించేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఏమిటి అనే అంశాలపై కూడా సమీక్షలో చర్చ జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సకాలంలో అందుతోందా లేదా, ఏమైనా పెండింగ్ చెల్లింపులు ఉన్నాయా అనే విషయాన్ని కూడా పరిశీలించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఎస్టీ కోటా కింద అదనంగా మంజూరైన 1,000 ఇళ్ల నిర్మాణ పురోగతిపై కూడా ఆయన వివరాలు అడిగారు. నిర్మాణ సామగ్రి ధరలు, కూలీల కొరత లేదా ఇతర స్థానిక సమస్యల కారణంగా ఎక్కడైనా ఆలస్యం జరుగుతోందా అనే అంశాన్ని కూడా స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.

ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి హౌసింగ్ శాఖ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ నిజమైన పేదలకు మాత్రమే ఇళ్లు అందేలా పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు.

గ్రామాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల పురోగతి నివేదికను ప్రతి వారం క్యాంప్ కార్యాలయానికి సమర్పించాలని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే మంజూరైన ఇళ్లను వేగంగా పూర్తి చేయడంతో పాటు రెండో విడత ఇళ్ల నిర్మాణాలను సమాంతరంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పినపాక నియోజకవర్గంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు అందించేందుకు ఇంకా ఎన్ని ఇళ్లు అవసరమో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇల్లు పేద కుటుంబానికి కేవలం ఒక పథకం మాత్రమే కాదు, అది వారి సొంతింటి కల. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలి. మంజూరైన ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి" అని స్పష్టం చేశారు.

బానోత్ నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలి:
జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ వినతి



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 13 తెలంగాణ పవర్ : బూర్గంపాడు మండలం లో అక్రమ వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ కరెంటు ఉచ్చులో మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ సభ్యులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరు మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

విధి నిర్వహణలో భాగంగా అటవీ ప్రాంతానికి వెళ్లిన బానోత్ నవీన్ అక్రమ వేటగాళ్లు ఏర్పాటు చేసిన కరెంటు ఉచ్చుకు గురై మృతి చెందారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నవీన్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం, కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీ సిబ్బందికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ సభ్యులు టి. శోభన్, పి. ఎర్రయ్య, జి. బాబురావు, బి. వెంకన్న, నరేష్, హతిరామ్, శరన్, మదన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్స్ కాన్వెంట్‌లో స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికలు





వేములవాడ, ఆగస్టు 13: కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికలు గురువారం సందడిగా జరిగాయి. సార్వత్రిక ఎన్నికల తరహాలో ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు చేపట్టారు. విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని తమకు నచ్చిన అభ్యర్థులకు ఓట్లు వేశారు. ఎన్నికల అనంతరం హెడ్ బాయ్‌గా ఎస్ ఆదిత్య, హెడ్ గర్ల్‌గా వి వైష్ణవి, వైస్ కెప్టెన్ బాయ్‌గా ఛ రిథేష్‌కుమార్, వైస్ కెప్టెన్ గర్ల్‌గా పి మనశ్వినీ, హౌస్ కెప్టెన్‌గా కె అవంతిక, సోషల్ క్లబ్ లీడ్‌గా ఎన్ రిషిక, కల్చరల్ క్లబ్ లీడ్‌గా ఎ హారిణి, స్పోర్ట్స్ క్లబ్ లీడ్‌గా ఎల్ విక్టర్ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ధరక్షన్ వస్పీయా మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకే ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, నిర్ణయ సామర్థ్యం, సమన్వయ భావన పెంపొందుతాయని చెప్పారు. భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఇవి దోహదపడతాయన్నారు.

మున్సిపల్ కార్మికులకు పెండింగ్లో ఉన్న మే నెల జీతం వెంటనే చెల్లించాలి
-సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి



జహీరాబాద్ ఆగస్టు 13: జహీరాబాద్ మున్సిపల్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మే నెల వేతనం పెండింగ్లో ఉందని, తక్షణమే మే నెల వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ కోరారు. ఈ సమస్య పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ తో చర్చించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ జనరల్ బడ్జెట్ లేదనే పేరుతో ఎస్టీఓల ద్వారా వేతనాలు ఇవ్వడానికి చెక్కు పంపడం తో ఇప్పటివరకు కనీసం ఆ నెల జీతం కూడా రాకుండా ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం పారిశుద్ధ కార్మికులకు కూడా వేతనాలు విడుదల చేయకుండా ట్రెజరీలో మూలిగిస్తూ పెద్ద ఎత్తున కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదన్నారు. తక్షణమే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని అన్నారు. స్పందించిన కమిషనర్ టెక్నికల్ సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకులు యశోదమ్మ, మోహన్, సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు



జహీరాబాద్ ఆగస్ట్ 13: జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం గుడ్పల్లి రైతు వేదికలో గురువారం చెరకు పంట యాజమాన్యం, నానో ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్ పూర్ శాస్త్రవేత్త విజయలక్ష్మి పాల్గొని చెరకు పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణ,పురుగు మందుల వినియోగం మరియు ఇతర శాస్త్రీయ పంట యాజమాన్య పద్ధతులను వివరించారు.

స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు బి.భిక్షపతి నానో ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు మరియు సరైన వినియోగ పద్ధతులపై రైతులకు వివరించారు.కంది పంటలో ఎండు తెగుళ్ళ నివారణ చర్యలను వివరించారు.


మొగుడంపల్లి మండల వ్యవసాయ అధికారి ఎండి. హస్నుద్దీన్ రైతులకు ఎరువుల బుకింగ్ యాప్ వినియోగ విధానం, వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు,రైతులకు అందుబాటులో ఉన్న సేవలను వివరించారు.

వ్యవసాయ విస్తరణ అధికారి కె.ప్రదీప్ కుమార్ నేల పరీక్షల ప్రాముఖ్యత, నేలలోని పోషక స్థితిని తెలుసుకోవడం, నేల పరీక్ష ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని పంట దిగుబడిని పెంచుకోవచ్చన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు సుదర్శన్ రెడ్డి,నందు, నారాయణ, ఉపసర్పంచ్ శేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, ఖనీజ్, ఆత్మ బిటియం చరణ్, రైతులు గోవర్ధన్ రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి, సిద్దా రెడ్డి, రాజేందర్ రెడ్డి, సాయి చరణ్, భాస్కర్, మారుతి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా


వారణాసి హన్మంతుడిగా రామ్‌చరణ్ ?






దర్శకధీరుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన మల్టీస్టారర్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ చిత్రంగా రూపొందుతున్న 'వారణాసి'లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ స్థాయిలో అడ్వెంచర్, యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పలు కాలాలను, విభిన్న ప్రపంచాలను కలిపి రాజమౌళి సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. 'వారణాసి' కథలో త్రేతాయుగానికి సంబంధించిన కీలకమైన ఎపిసోడ్ ఉంటుందని, ఆ భాగంలో మహేశ్‌బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. శ్రీరాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపించే ఎపిసోడ్‌లో హనుమంతుడిగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మొదట హనుమంతుడి పాత్ర కోసం మరో నటుడి పేరు వినిపించినప్పటికీ, ఈ పాత్రకు కావాల్సిన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ దృష్ట్యా రామ్ చరణ్ అయితే మరింత ప్రభావవంతంగా ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

ఇంద్రపుత్రగా కిరణ్ అబ్బవరం



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఇటీవల ఆయన నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది. ఈ నక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బ్జడెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు. భారీ విజువల్స్, పురాణ నేపథ్యం, విభిన్నమైన కథాంశంతో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 'ఇంద్రపుత్ర' రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.

సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల



యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను సైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.

కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల



నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

ఆదిపురుష్‌తో రామాయణను పోల్చవద్దు



రామాయణ విజయం సాధించాలన్న మనోజ్ .బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి వార్తల్లో నిలుస్తోంది. గతంలో వచ్చిన 'ఆదిపురుష్'తో ఈ చిత్రాన్ని పోలుస్తూ కొందరు పోస్ట్‌లు పెడుతున్నారు. తాజాగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఆదిపురుష్' రచయిత మనోజ్ దీనిపై మాట్లాడారు. 'రామాయణ'లో రావణుడి పాత్ర పోషించిన యశ్‌పై ప్రశంసలు కురిపించారు. యశ్ చాలా మంచి నటుడు. అందులో ఎలాంటి సందేహం లేదు. మన భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే ఏ సినిమాకైనా నా పూర్తి మద్దతు ఉంటుంది. 'రామాయణ' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చొద్దు. అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేపోయింది. ఆ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. అయితే, 'ఆదిపురుష్' సంగీతం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు రామాయణ మ్యూజిక్ కూడా హిట్ కావడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని మనోజ్ తెలిపారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్న రామాయణ చిత్రం రెండు భాగాలుగా రానుంది. ఇప్పటికే రెండో భాగం కూడా 50 శాతం షూటింగ్ పూర్తయినట్లు రణ్‌బీర్ తెలిపారు. రామాయణ లాంటి గొప్ప కథను 10 భాగాలు తీయొచ్చని రెండు భాగాల్లోనే నితీశ్ తివారీ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. దీపావళికి ఈ సినిమా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది

మహేశ్ బాబు ఎఐ వీడియో షేర్ చేసి వంగా



కృష్ణ డైలాగ్ మహేశ్ పలికినట్లుగా క్రియేషన్ .ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన మహేశ్ బాబు ఏఐ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. సూపర్ స్టార్ పుట్టినరోజు సందర్భంగా అందరూ విషెస్ చెప్పగా.. సందీప్ ఓ ఏఐ వీడియోతో శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మహేశ్ కూడా ఫిదా అయ్యారు. దివంగత లెజండరీ నటుడు కృష్ణ 'కిరాయి కోటిగాడు' సినిమాలో చెప్పిన ఐకానిక్ డైలాగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో సందీప్ రీక్రియేట్ చేశారు. ఈ వీడియోతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై గతంలో జరిగిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ప్రచారం పొందిన 'దెవిల్' ప్రాజెక్ట్‌పై సందీప్ హింట్ ఇచ్చారా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మహేశ్ పోస్ట్ పెట్టారు. 'వారణాసి' తనకెంతో ప్రత్యేకమైన చిత్రమని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదల కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అభిమానులంతా గర్వపడేలా 'వారణాసి' ఉంటుందన్నారు.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844